
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
సంగారెడ్డి 3 మెదక్
జిల్లాల వార్తలు
శనివారం 14 జూన్ 2025



Harish Rao Thannee... @BRSHarish Follow

Congratulations and best wishes to the teachers and students of Indiranagar Government School in Siddipet.

I hope this success story continues and inspires many more!



'ఆంధ్రజ్యోతి' కథనంపై ఎక్స్‌లో హరీశ్‌రావు పోస్టు

ఇందిరానగర్ బడి విజయపరంపర
కొనసాగుతూనే ఉండాలి
'ఆంధ్రజ్యోతి' కథనాన్ని ఎక్స్‌లో పోస్టు చేసి అభినందనలు తెలిపిన హరీశ్‌రావు

ఆంధ్రజ్యోతి ప్రతినిధి, సంగారెడ్డి, జూన్ 13 : సిద్దిపేటలోని ఇందిరానగర్ ప్రభుత్వ పాఠశాల సాధించిన సత్ఫలితాలపై శుక్రవారం 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనాన్ని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే ప్రస్తావిస్తూ ఎక్స్‌లో పోస్టు చేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థుల కృషిని అభినందించారు. ఇందిరానగర్ బడి విజయ పరంపర కొనసాగుతూనే ఉండాలని ఆకాంక్షించారు. సర్కారు బడి సాధిస్తున్న అద్భుతాలను ప్రచురించి స్ఫూర్తిని కలిగించేలా 'ఆంధ్రజ్యోతి' గొప్ప ప్రయత్నం చేసిందని ప్రశంసించారు.

నకిలీ వైద్యులపై ఎఫ్ఐఆర్
మెడికల్ కౌన్సిల్ కొరడా

సంగారెడ్డి అర్బన్, జూన్ 13(ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి జిల్లాలో పది మంది నకిలీ వైద్యులపై ఎఫ్ఐఆర్ నమోదు చేసినట్టు తెలంగాణ మెడికల్ కౌన్సిల్ ప్రజా సంబంధాల కమిటీ చైర్మన్ డా.నరేశ్‌కుమార్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. మెడికల్ కౌన్సిల్ ఆధ్వర్యంలో ఇటీవల జిల్లావ్యాప్తంగా విస్తృత తనిఖీలు నిర్వహించామని, వైద్య విద్యార్హత లేని వ్యక్తులు డాక్టర్లుగా వ్యవహరిస్తున్నట్లు తనిఖీల్లో గుర్తించినట్లు ఆయన వివరించారు. వీరిపై కొండాపూర్ పీఎస్ పరిధిలో రెండు, సదాశివపేట పీఎస్‌లో 1, మునిపల్లిలో 1, హత్నూరలో 1, సంగారెడ్డి టౌన్ పీఎస్‌లో రెండు, రూరల్ పీఎస్‌లో 1, పటాన్‌చెరులో రెండు కేసులు నమోదైనట్లు ఆయన తెలిపారు. ఆయా హాస్పిటళ్లు, క్లినిక్‌లపై ఎన్ఎంసీ చట్టం సెక్షన్ 34, 54, తెలంగాణ రాష్ట్ర మెడికల్ ప్రాక్టీషనర్స్ రిజిస్ట్రేషన్ చట్టం సెక్షన్ 22, భారతీయ న్యాయ శిక్షా నియమావళి (బీఎన్ఎస్) సెక్షన్లు 18, 19 ప్రకారం కేసులు నమోదు చేసినట్లు వివరించారు.

తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు
మహేశ్‌కుమార్‌గౌడ్‌ను కలిసిన నిర్మలాజగ్గారెడ్డి



టీపీసీసీ చీఫ్ మహేష్‌కుమార్‌గౌడ్‌కు సంగారెడ్డి జిల్లాలో పార్టీ పరిస్థితులను వివరిస్తున్న నిర్మలా జగ్గారెడ్డి

సంగారెడ్డి టౌన్, 13(ఆంధ్రజ్యోతి): తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్‌ను టీజీఐఐసీ చైర్పర్సన్ తూర్పు నిర్మలాజగ్గారెడ్డి శుక్రవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ముందుగా మహేష్‌కుమార్‌గౌడ్‌కు శాలువా కప్పి, పుష్పగుచ్చం అందజేశారు. అనంతరం సంగారెడ్డి జిల్లాలో కాంగ్రెస్ పార్టీ స్థితిగతులపై నిర్మలా జగ్గారెడ్డి వివరించారు. టీపీసీసీ రాష్ట్ర కమిటీలో ఉపాధ్యక్షులుగా, ప్రధాన కార్యదర్శులుగా పలువురు నాయకులకు నియమించి, సంగారెడ్డి జిల్లాకు అధిక ప్రాధాన్యం ఇవ్వడం పట్ల మహేశ్‌కుమార్‌గౌడ్‌కు నిర్మలా జగ్గారెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. సంగారెడ్డి జిల్లాలో పార్టీ బలోపేతానికి ప్రతీఒక్కరూ కృషి చేసేలా కార్యకర్తలకు దిశా, నిర్దేశం చేయాలని సూచించారు. త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించుకునేలా కార్యకర్తలందరూ సైనికుల్లా పనిచేయాలన్నారు.



చీఫ్ మహేష్‌కుమార్‌గౌడ్‌ను సన్మానిస్తున్న నిర్మలాజగ్గారెడ్డి

ఇటు నుంచి అటు..
అటు నుంచి ఇటు!

- పక్క రాష్ట్రాలకు ఎరువులు, విత్తనాల అక్రమ తరలింపు
- సరిహద్దు మండలాల్లో దందా
- డిమాండ్ ఉన్న బ్రాండ్ పత్తి విత్తనాలకు రూ.వెయ్యి వసూలు
- ప్రశ్నిస్తే స్టాక్ లేదంటూ దుకాణదారుల దబాయింపు

సంగారెడ్డి జిల్లా పరిధిలోని సరిహద్దు మండలాల్లో ఎరువులు, విత్తనాల దందా జోరుగా సాగుతున్నది. ఇక్కడ తక్కువ ధరకు దొరికే ఎరువులు, విత్తనాలను సరిహద్దు దాటించి కర్ణాటకకు తరలిస్తున్నారు. అక్కడ దొరికే విత్తనాలను బిల్లులు లేకుండానే ఇక్కడికి తీసుకువస్తున్నారు. వానాకాలం సీజన్ ప్రారంభం కావడంతో నారాయణఖేడ్, జహీరాబాద్ నియోజకవర్గాల పరిధిలోని సరిహద్దు గ్రామాల్లో ఈ దందా సాగుతున్నది.

కంగ్టి, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): మృగశిర కార్తె ప్రవేశంతో వానాకాలం సాగు పనులు ఊపందుకుంటున్నాయి. ఈ తరుణంలో ఫర్టిలైజర్ వ్యాపారులు రైతుల అవసరాలను ఆసరాగా చేసుకొని నిలువునా దోచుకుంటున్నారు. కర్ణాటక సరిహద్దుల్లో ఉన్న కంగ్టి మండలంతో పాటు తడ్కల్‌లో పత్తి విత్తనాలు, ఎరువులను ఇష్టారీతిన సరిహద్దు దాటిస్తున్నారు. దీంతో, స్థానికంగా ధరలు విపరీతంగా పెరిగిపోయాయి. కంగ్టి మండలంలో ఫర్టిలైజర్ వ్యాపారులు ఆడిందే ఆటగా సాగుతునన్నది. స్థానిక రైతులకు దక్కాల్సిన డీఏపీ ఎరువుల బస్తాలను పక్కనే ఉన్న కర్ణాటక, మహారాష్ట్ర రైతులకు అధిక ధరలకు అమ్ముకుంటున్నారు. ఒక్కో డీఏపీ బస్తాను రూ.1,350 విక్రయించాల్సి ఉండగా.. రూ.1,550 వరకు అమ్ముతూ సొమ్ము చేసుకుంటున్నారు. అలాగే, 450 గ్రాముల పత్తి విత్తనాల ప్యాకెట్ ఎమ్మార్పీ రూ.901 ఉండగా కంగ్టిలో ఒక్కో ప్యాకెట్‌ను రూ.వెయ్యికి విక్రయిస్తున్నారు. ఈ ప్రాంతంలలో డిమాండ్ ఉన్న లోటస్ బ్రాండ్ పత్తి విత్తనాలను ఎమ్మార్పీ కంటే ఎక్కువ ధరకు అమ్ముతున్నారని రైతులు ఆవేదన



గురుజువాడలో రైతులతో మాట్లాడుతున్న కోహీర్ ఏవో, ఎస్సై

మిగతా 6వ పేజీలో



సంగారెడ్డి కలెక్టర్ పి.ప్రావీణ్యకు స్వాగతం పలుకుతున్న అదనపు కలెక్టర్ చంద్రశేఖర్

సంగారెడ్డి జిల్లా నూతన కలెక్టర్‌గా 2016 ఐఏఎస్ బ్యాచ్ అధికారిణి ప్రావీణ్య శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. హనుమకొండ జిల్లా కలెక్టర్‌గా పనిచేసి ఇక్కడికి బదిలీపై వచ్చారు. ఇప్పటి వరకు సంగారెడ్డి కలెక్టర్‌గా క్రాంతి వల్లూరు తనదైన ముద్ర వేస్తున్న సమయంలోనే ఆమెకు స్థాన చలనం కలిగింది. ఫలితంగా జిల్లాలో పలు సమస్యలు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్లుగా కనిపిస్తున్నాయి. కొత్త కలెక్టర్‌కు సమస్యలు స్వాగతం పలుకుతున్నాయి. తన అనుభవాన్ని రంగరించి పరిపాలనలో ప్రావీణ్యత కనబరిస్తేనే జిల్లా అభివృద్ధికి, జిల్లా ప్రజలకు ప్రయోజనం కలుగుతుందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

సమస్యల సవాల్
బాధ్యతలు చేపట్టిన కొత్త కలెక్టర్

- సంగారెడ్డి జిల్లాలో సమస్యలెన్నో..
- రెవెన్యూ శాఖపై అవినీతి ఆరోపణలు
- సర్కారు భూములు అన్యాక్రాంతమవుతున్నా చర్యలు శూన్యం
- పలు శాఖల అధికారులపై ఫిర్యాదుల వెల్లువ
- మున్సిపాలిటీల నిర్వహణపై కొరవడిన పర్యవేక్షణ
- పాలనలో 'ప్రావీణ్య'ం కనబరిస్తేనే జిల్లాకు మేలు

ఆంధ్రజ్యోతి ప్రతినిధి, సంగారెడ్డి, జూన్ 13: సంగారెడ్డి జిల్లా కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన ప్రావీణ్య హనుమకొండ జిల్లాలో తనదైన శైలిలో బాధ్యతలు నిర్వర్తించి ప్రత్యేకతను చాటుకున్నారు. నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారం కోసం కృషిచేశారనే పేరుంది. అందుకే రాష్ట్రంలో కీలకమైన సంగారెడ్డి జిల్లాకు కలెక్టర్‌గా ఆమెకు అవకాశం కల్పించారనే చర్చ జరుగుతోంది. విస్తీర్ణంలో హనుమకొండ చిన్న జిల్లా. కానీ సంగారెడ్డిలో 28 మండలాలు, 12 మున్సిపాలిటీలు, 3 జీహెచ్ఎంసీ డివిజన్లు, 5 అసెంబ్లీ నియోజకవర్గాలు ఉంటాయి. ఈ జిల్లా రథసారధిగా నిరూపించుకోవాలంటే ఎంతో కృషి చేయల్సిన అవసరం ఉంటుంది.

రెవెన్యూ యంత్రాంగంపై ఆరోపణలు

జిల్లాలోని పటాన్‌చెరు, సంగారెడ్డి, జహీరాబాద్ ప్రాంతాలు పారిశ్రామికంగా, రియల్ఎస్టేట్ పరంగా అభివృద్ధి చెందుతున్నాయి. దీంతో ఇక్కడి భూముల ధరలు ఆకాశాన్నంటాయి. ముఖ్యంగా పటాన్‌చెరు నియోజకవర్గం రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌కు అతిసమీపంలో ఉండడంతో భూముల ధరలు కోట్లలో పలుకుతున్నాయి. ఫలితంగా భూముల లావాదేవీల్లో రెవెన్యూ శాఖ కీలకంగా మారింది. రిజిస్ట్రేషన్లు, మ్యూటేషన్లు, ఫ్రీడంఫైటర్ల ఎన్‌వోసీలు, అసైన్డ్ ల్యాండ్ వ్యవహారాలు, బిలా దాఖల జిమ్మిక్కులు, నాలా కన్వర్షన్లు ఇలా ఎన్నో అంశాలను చక్కదిద్దే బాధ్యతను రెవెన్యూ అధికారులు, సిబ్బంది నెత్తిన వేసుకుంటున్నారే ఆరోపణలు ఎదుర్కొంటున్నారు. ఏసీబీ అధికారులతోపాటు జిల్లా యంత్రాంగానికీ కొందరిపై ఇప్పటికే ఫిర్యాదులు అందుతున్నాయి. అధికారులు కాపాడాల్సిన అసైన్డ్ భూములను స్వయంగా వారే ఇతరులకు ధారాదత్తం చేస్తున్నారనే ఆరోపణలు మెండుగా ఉన్నాయి. దీనిపై కనీస విచారణ కూడా చేయడం లేదు. ఇటీవల కాలంలో పటాన్‌చెరు నియోజకవర్గంలోని పలు భూముల విషయాల్లో ఉన్నతాధికారుల దాకా ఆరోపణలు రావడం గమనార్హం. ఎక్కడికక్కడ కబ్జాలు కొనసాగుతున్నా మొక్కుబడి

మిగతా 6వ పేజీలో

సంగారెడ్డి కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన ప్రావీణ్య

సంగారెడ్డి టౌన్, 13 (ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి జిల్లా నూతన కలెక్టర్‌గా పి.ప్రావీణ్య శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. జిల్లా కేంద్రంలోని రోడ్లు భవనాల శాఖ అతిథి గృహానికి చేరుకున్న కలెక్టర్ ప్రావీణ్యకు జిల్లా అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, ఆర్డీవో రవీందర్‌రెడ్డి స్వాగతం పలికారు. అనంతరం కలెక్టరేట్ కార్యాలయ సముదాయంలోని కలెక్టర్ ఛాంబర్‌లో ఆమె బాధ్యతలు స్వీకరించారు. 2016 బ్యాచ్‌కు చెందిన ఐఏఎస్ అధికారి పి.ప్రావీణ్య హనుమకొండ జిల్లా కలెక్టర్‌గా, గ్రేటర్ వరంగల్ మునిసిపల్ కార్పొరేషన్ కమిషనర్‌గా, జీహెచ్ఎంసీ అదనపు కమిషనర్‌గా అనేక కీలక బాధ్యతలు నిర్వహించారు.

పన్ను వసూళ్లలో అక్రమాలపై..
తూతూమంత్రంగా విచారణ

- సీడీఎంఏ వెంటే ఆరోపణలు ఎదుర్కొంటున్న అధికారి
- ఫిర్యాదుదారుడిపైనే ప్రశ్నల వర్షం

6



జిల్లా ప్రధాన న్యాయాధికారిని కలిసిన ఎస్పీ

మెదక్ అర్బన్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): మెదక్ జిల్లా నూతన ఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన డీవీ శ్రీనివాసరావు జిల్లా ప్రధాన న్యాయాధికారి నీలిమను శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. జిల్లాలో నేరాల నమోదు, దర్యాప్తు, కేసుల ట్రయల్స్, లోక్ అదాలత్ నిర్వహణ, నేరస్తులకు శిక్షల అమలు తదితర అంశాలపై చర్చించారు. కోర్టు అధికారులు, పోలీసుల సమన్వయంతో పనిచేసి త్వరితగతిన కేసుల పరిష్కారం చూపాలని న్యాయమూర్తి ఎస్పీకి సూచించారు.

మనవత్వం చాటుకున్న ఎస్పీ

మెదక్ ఎస్పీ శ్రీనివాసరావు మానవత్వాన్ని చాటుకున్నారు. కొల్చారం పోలీస్‌స్టేషన్‌ను పరిశీలించిన తిరిగి మెదక్‌కు వస్తున్న క్రమంలో స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల వద్ద జరిగిన ప్రమాదంలో ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడ్డారు. గమనించిన ఎస్పీ శ్రీనివాసరావు ఎస్కార్ట్ వాహనంలో ఆయనను ఆస్పత్రికి తరలించారు.



న్యాయాధికారి నీలిమకు పూల మొక్కను అందజేస్తున్న మెదక్ ఎస్పీ శ్రీనివాసరావు

స్ఫూర్తి ప్రదాతలు

- రక్తమిచ్చి ప్రాణాలు కాపాడుతున్న దాతలు
- ఒక్కొక్కరు పదుల సార్లు రక్తదానం
- నేడు ప్రపంచ రక్తదాతల దినోత్సవం

సంగారెడ్డి జీజీహెచ్‌లో మెడికోల రక్తదానం 5

ఏబీవీపీ సిద్దిపేట జిల్లా కన్వీనర్‌పై
దుండగుల దాడి 4



సమావేశంలో మాట్లాడుతున్న మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్

ఇందిరమ్మ ఇళ్లకు
ఉచిత ఇసుక
మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్

మెదక్ అర్బన్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో నిర్మిస్తున్న ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు అవసరమయ్యే ఇసుకను ఉచితంగా అందించేందుకు చర్యలు తీసుకోవాలని మెదక్ కలెక్టర్ రాహుల్ రాజ్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో శుక్రవారం అధికారులతో ఏర్పాటు చేసిన సమీక్షలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ నిర్మాణాలకు జీరో పర్మిట్ ద్వారా కాంట్రాక్టర్లు, ఆన్‌లైన్‌లో ఇసుక, కంకర, మినరల్స్ కొనుగోలు చేసేలా అధికారులు చర్యలు చేపట్టాలని సూచించారు. తెలంగాణ స్టేట్ మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ద్వారా ప్రభుత్వ అభివృద్ధి పనులకు కావాల్సిన ఇసుక ఇండెంట్, ఇరిగేషన్, పంచాయతీ రాజ్, రోడ్ల భవనాలు తదితర శాఖల ఇంజనీరింగ్ అధికారులు స్టాక్ పాయింట్ల నుంచి తెప్పించుకోవాలని నిర్దేశించారు. అవసరమైతే ఇతర జిల్లాల ఇసుక రీచ్ ద్వారా తీసుకోవాలని సూచించారు. అక్రమ ఇసుక రవాణాను అరికట్టాలని ఆదేశించారు.

ఆకట్టుకునేలా విద్యా బోధన

హవేళిఘణపూర్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు ఆసక్తి పెంచేలా విద్యా బోధన చేయాలని కలెక్టర్ రాహుల్‌రాజ్ పేర్కొన్నారు. మండలంలోని కూచన్‌పల్లి ప్రాథమిక పాఠశాలను శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బడిలో విద్యార్థుల సంఖ్య పెంచేందుకు బడిబాట, అవగాహనా కార్యక్రమాలు చేపట్టాలన్నారు. అనంతరం భూ భారతి సదస్సును పరిశీలించారు.

ఎద్దు ఏడ్చింది!
పశుసంపదలో గణనీయమైన తగ్గుదల

- ఆందోళనకరంగా పశుగణన లెక్కలు
- సగానికి తగ్గిన ఎద్దులు, ఆవులు, గేదెలు, దున్నపోతల సంఖ్య
- జీవాల సంఖ్యా మైనస్‌లోనే
- పర్యావరణం, వ్యవసాయంపై ప్రభావం



మెదక్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు మూల స్తంభం వంటి పశుసంపద తగ్గిపోతున్నది. ఇటీవల చేపట్టిన పశుగణన లెక్కలు ఈ విషయాన్ని తేల్చిచెప్పాయి. ఈ పరిణామం వ్యవసాయ రంగం, పర్యావరణానికి చేటు తెస్తుందని నిపుణులు అందోళన వ్యక్తం చేస్తున్నారు. దేశవ్యాప్తంగా చేపట్టిన 21వ పశుగణన గత నెల ముగిసింది. అందుకు సంబంధించిన లెక్కలను అధికారికంగా వెల్లడించారు. గత ఐదేళ్లలో 42 శాతం పశు సంతతి తగ్గినట్లు సర్వేలో తేలింది. ఆవులు, గేదెలు, ఎద్దులు, దున్నపోతుల సంఖ్య దాదాపు సగం తగ్గిపోతున్నట్లు వెల్లడైంది. ఇవేకాకుండా గొర్రెలు, మేకల సంతతి కూడా గణనీయంగా తగ్గినట్లు తెలుస్తోంది. ఇందుకు భిన్నంగా పౌల్ట్రీ పరిశ్రమ మాత్రం 250 శాతం పెరిగినట్లు లెక్కలు చెబుతున్నాయి.

ఆవులు, ఎద్దులు 89 వేలు మాత్రమే

మెదక్ జిల్లాలో పశుసంవర్ధకశాఖ నిర్వహించిన సర్వే ప్రకారం తెల్లజాతి పశుసంతతికి చెందిన ఆవులు, ఎద్దులు కేవలం 89వేలు మాత్రమే ఉన్నట్లు గుర్తించారు. కానీ, క్షీర సంపదకు దోహదపడే నల్ల జాతి పశువుల సంఖ్య మాత్రం ఆశాజనకంగానే ఉన్నది. జిల్లాలో గేదెలు, దున్నపోతులు 1.79 లక్షలు ఉన్నట్లు తెలుస్తున్నది. జిల్లావ్యాప్తంగా 3.50 లక్షల గొర్రెలు, 1,49,500 మేకలు ఉన్నట్లు గణాంకాలు వెల్లడిస్తున్నాయి. ఇది, గత సర్వేతో పోలిస్తే గణనీయంగా తగ్గింది. ఐదేళ్ల క్రితం నిర్వహించిన సర్వేలో జిల్లాలో గొర్రెలు, మేకలు 6.37 లక్షలు ఉండేవి. వాటి సంఖ్య పెరగాల్సి ఉండగా తగ్గుదల కనిపిస్తుండడం అందోళన కలిగిస్తోంది.



అదేవిధంగా పందులు గతంలో 4 వేలు ఉండగా.. ప్రస్తుతం 3,556కు తగ్గిపోయాయి.

కోళ్ల సంఖ్య పెరుగుదల

జిల్లావ్యాప్తంగా పౌల్ట్రీ పరిశ్రమ విస్తరిస్తుండటంతో కోళ్ల సంఖ్య పెరుగుతున్నది. విపరీతమైన లాభాలు గడిస్తున్న కోళ్ల పరిశ్రమ మారుమూల పల్లెలకూ విస్తరించింది. ప్రస్తుతం ప్రతీ గ్రామంలోనూ బ్రాయిలర్ పౌల్ట్రీ ఫారాలు కనిపిస్తున్నాయి. గత సర్వే ప్రకారం జిల్లా వ్యాప్తంగా 25 లక్షల కోళ్లు ఉండగా.. ప్రస్తుత సర్వే ప్రకారం ఈ సంఖ్య 86 లక్షలకు పెరిగినట్లు తెలుస్తున్నది. అంటే సుమారు 250 శాతం పెరుగుదల నమోదైంది.

గ్రాసం కొరతే కారణం!

జిల్లాలో పశుసంతతి తగ్గిపోవడానికి మేత కొరతే కారణమని నిపుణులు భావిస్తున్నారు. గతంలో పల్లెల్లో పచ్చని పచ్చిక బయళ్లు కనిపించేవి గొర్రెలు, ఆవులు, గేదెలు మేసేందుకు గ్రామ శివారు ఉండేది. ప్రస్తుతం పచ్చిగడ్డి కూడా అంతరించే దుస్థితి దాపురించింది. ఎక్కడ చూసినా వెంచర్లు వెలుస్తుండడంతో పశువులకు మేతకు తావులేకుండాపోతోంది. మండల కేంద్రాలు, పెద్ద గ్రామాల్లోనూ వ్యవసాయ భూముల్ని ప్లాట్లుగా మారుస్తున్నారు.

ఫైర్‌మెన్ జీవితం.. గాల్లో దీపం

- రెండు నెలలుగా జీతాలు కరువు.. ఫైర్ అవుట్ పోస్టులు ఎత్తివేసే యోచన
- రోడ్డున పడనున్న ఫైర్ హోంగార్డ్స్.. డిప్యూటీ సీఎం, పీసీసీ చీఫ్‌కు విన్నపాలు



రామాయంపేటలోని ఫైర్ అవుట్ పోస్ట్

రామాయంపేట, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): ప్రమాద సమయాల్లో ప్రాణాలు పణంగా పెట్టి ప్రజలను కాపాడే ఫైర్‌మెన్ బతుకులు దయనీయంగా మారాయి. రేయింబవళ్లు విధులు నిర్వర్తించే వారి జీవితాలు ఆగమ్య గోచరంగా తయారయ్యాయి. మెదక్ జిల్లాలో ఫైర్ సిబ్బందికి రెండు మాసాలుగా వేతనాలు అందక సతమతమవుతున్నారు. శిక్షణపొంది విధుల్లో కొనసాగుతున్న ఫైర్‌హోంగార్డ్స్‌ను తొలగించేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. ప్రతీ ఏడాదిలా ఈసారి వారిని రెన్యువల్ చేసేందుకు ప్రతిపాదనలు పంపలేదు. దీంతో, తెలంగాణలోని 14 ఫైర్ ఔట్‌పోస్టులు ఎత్తివేసే అవకాశం ఉన్నట్లు తెలుస్తున్నది. 2017 సంవత్సరం తీసుకువచ్చిన జీవో ఎం.ఎస్.నం.35కు ప్రభుత్వం ఎసరు పెట్టనుండటంతో రాష్ట్రంలోనూ 240 మంది బతుకులు ఆగం కానున్నాయి. ఇదే జరిగితే జిల్లాలో 27 మంది ఫైర్‌హోంగార్డ్స్ వీధిన పడతారు. ఇప్పటికే విధుల్లో ప్రాణాలు వదిలినా పరిహారం అందని దైన్యస్థితిలో ఉన్న ఔట్‌సోర్సింగ్ ఫైర్ మెన్‌లకు ఏప్రిల్, మే నెల జీతాలు రాక అవస్థల్లో మునిగారు. ప్రస్తుతం వీరికి నెలకు రూ.30 వేలు వేతనం ఇస్తున్నారు. కానీ సెలవు పెడితే ఆ రోజు జీతం కట్ చేస్తున్నారు. విపత్తు సమయాల్లో ముందుండే వీరిని తొలగిస్తే ప్రమాద సందర్భాల్లో కాపాడే వారే కరువవుతారు. ఫైర్ హోంగార్డ్స్‌ను పర్మినెంట్ చేస్తామన్న ప్రభుత్వ ప్రకటనలను పక్కనపెట్టి ఉన్నవారికే ఎసరు పెట్టే ప్రయత్నాలపై ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. ఈ విషయంపై మూడు రోజుల క్రితం రాష్ట్రంలోని కాంట్రాక్ట్ ఫైర్ హోంగార్డులు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, ఎమ్మెల్సీ, పీసీసీ చీఫ్ మహేష్‌కుమార్ గౌడ్‌లను కలిసి విన్నవించారు. తమ ఉద్యోగాలను పర్మినెంట్ చేయాలని కోరారు.

పిడుగుపాటుకు 11 మేకలు మృతి

నంగునూరు, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఘనాపూర్ గ్రామంలో పిడుగు పాటుకు 11 మేకలు మృత్యువాత పడ్డాయి. శుక్రవారం సాయంత్రం కురిసిన వర్షానికి మేకలు అదే గ్రామానికి చెందిన బోడ సత్య నారాయణ మామిడి తోటలో చెట్టు కిందకు వెళ్లాయి. ఒక్కసారిగా పిడుగు పడడంతో గ్రామానికి చెందిన ఏలేటి లక్ష్మారెడ్డికి చెందిన 7 మేకలు, లింగం పల్లి కొమురయ్యకు చెందిన 4 మేకలు మృతి చెందాయి. ఆ సమయంలో మేకల కాపర్లు దూరంగా ఉండటంతో ప్రాణాపాయం తప్పింది. సుమారు రూ.2 లక్షల మేర నష్టం జరిగినట్లు బాధితులు తెలిపారు. ఆర్ఐ లింగం ఘటనా స్థలానికి చేరుకుని పంచనామా నిర్వహించారు.

ఏబీవీపీ జిల్లా కన్వీనర్‌పై దుండగుల దాడి

- ఇటీవల మావోయిస్టులపై తీవ్ర విమర్శలు చేసి.. ర్యాలీ నిర్వహించిన ఆదిత్య
- కమ్యూనిస్టులను దూషిస్తావా అంటూ దాడి చేశారని ఫిర్యాదు
- నిరసనగా హుస్నాబాద్‌లో పాఠశాలల బంద్



గాయాలైన ఏబీవీపీ జిల్లా కన్వీనర్ సావుల ఆదిత్య

హుస్నాబాద్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ పట్టణానికి చెందిన ఏబీవీపీ జిల్లా కన్వీనర్ సావుల ఆదిత్యపై గురువారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు దాడి చేశారు. పిడిగుద్దులతోపాటు ఆయుధంతో దాడి చేయడంతో ఆదిత్యకు తీవ్ర గాయాలు అయ్యాయి. దీంతో ఆయనను కరీంనగర్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించి చికిత్స నందిస్తున్నారు. పోలీసులు, బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. కరీం నగర్‌లో నివాసం ఉంటున్న ఆదిత్య గురువారం ఏబీవీపీ నగర కమిటీని నియమించేందుకు హుస్నాబాద్‌కు వచ్చారు. రాత్రి సమయంలో మండ లంలోని పందిల్ల గ్రామంలో స్నేహితుడిని కలిసి తిరిగి హుస్నాబాద్‌కు వస్తున్న క్రమంలో పొట్లపల్లి - ఆరపల్లి రహదారిలో మూత్ర విసర్జన చేస్తుండగా, గుర్తు తెలియని ముగ్గురు వ్యక్తులు వెనుకనుంచి వచ్చి కొట్ట డమే కాకుండా కాకుండా పదునైన ఆయుధంతో దాడి చేయగా తాను అరవడంతో పారిపోయారు. ఆదిత్యకు గాయాలు కావడంతో మొదట హుస్నాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకువచ్చారు. అనంతరం మెరుగైన చికిత్స కోసం కరీంనగర్‌కు తరలించారు. దాడి సమయంలో వారు 'కమ్యూనిస్టులను కుక్కలంటావా' అంటూ కొట్టారని బాధితుడు పేర్కొన్నారు. అయితే, ఆదిత్య ఈ నెల 9న ఏబీవీపీ ఆధ్వర్యంలో మావోయిస్టులు జనజీవన స్రవంతిలో కలవాలని హుస్నాబాద్‌లో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మావోయిస్టులపై తీవ్ర విమర్శలు చేశారు. ఈ కారణంగానే ఆదిత్యపై దాడి చేశారా..? ఇంకా ఏదైనా కారణముందా..? అనే కోణంలో పోలీసులు విచారణ జరుపుతున్నారు. హుస్నాబాద్ ఏసీపీ సదానందం, సీఐ శ్రీనివాస్, ఎస్ఐ తోట మహేశ్‌లు రాత్రి ఆసుపత్రికి వెళ్లి ఆదిత్యతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. శుక్రవారం జరిగిన సంఘటన స్థలం వద్దకు వెళ్లి పరిశీలించారు. ఆదిత్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ మహేశ్ తెలిపారు. ఆదిత్యపై దాడి చేసిన వ్యక్తులను శిక్షించాలని సోమవారం ఏబీవీపీ నాయకులు పాఠశాలల బంద్‌కు పిలుపునిచ్చి పట్టణంలోని మల్లె చెట్టు చౌరస్తాలో ధర్నా చేశారు.

నక్సలైట్ల దిష్టిబొమ్మ దహనం

సంగారెడ్డి అర్బన్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): ఏబీవీపీ సిద్దిపేట జిల్లా కన్వీనర్ ఆదిత్యపై హుస్నాబాద్‌లో జరిపిన దాడి పిరికిపంద చర్య అని ఏబీవీపీ రాష్ట్ర కార్యసమితి సభ్యులు ఆకాశ్ అన్నారు. ఏబీవీపీ నేతపై దాడిని నిరసిస్తూ శుక్రవారం సంగారెడ్డిలోని ఐబీ వద్ద నక్సలైట్ల దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా ఆకాశ్ మాట్లాడుతూ ఏబీవీపీ నేతలపై జరిపిన దాడిని దేశభక్తి, విద్యార్థి ఉద్యమంపై దాడిగా అభివర్ణిస్తామన్నారు. ఈ చర్య నక్సలైట్ల ఓటమి భయాన్ని సూచిస్తుందన్నారు. తుపాకులు, కత్తులకు ఏబీవీపీ కార్యకర్తలు భయపడరని, ఆదిత్యపై దాడి చేసిన నక్సల్స్ మూకపై వెంటనే పోలీసు శాఖ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నగర కార్యదర్శి మహేశ్, ప్రవీణ్, భీమేష్ తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా ఆదిత్యపై జరిగిన దాడిని సిద్దిపేట పట్టణ బీజేపీ అధ్యక్షుడు బాసంగారి వెంకట్ ఖండించారు. నిందితులను గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.



సంగారెడ్డిలోని ఐబీ వద్ద నక్సలైట్ల దిష్టిబొమ్మను దహనం చేస్తున్న ఏబీవీపీ నాయకులు

ముంబై సముద్రంలో మునిగి యువకుడి మృతి

- సోదరిని దింపి వచ్చేందుకు వెళ్లి కానరాని లోకాలకు..



రాము (ఫైల్)

రామాయంపేట, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): అప్పటిదాకా బోటు షికారు. సోదరి.. ఆమె కుటుంబంతో కలిసి కేరింతలు.. కానీ, ఆ ఆనందం అరక్షణంలో ఆవిరైంది. సోదరిని ఇంటి వద్ద వదిలి వచ్చేందుకు ముంబైకి వెళ్లిన యువకుడు సముద్రతీరంలో అలలకు కొట్టుకుపోయాడు. మెదక్ జిల్లా రామాయంపేటకు చెందిన టంకరి రాము (34) సోదరి కుటుంబం ముంబైలో ఉంటుంది. ఆమె తల్లిగారింటికి రాగా, ఆమెను మళ్లీ ముంబైలో వదిలేందుకు టంకరి రాము మూడు రోజుల క్రితం ఆమెతో కలిసి అక్కడి వెళ్లాడు. తెల్లారితే ఇంటికి రావాల్సిన అతను అక్క, ఆమె కుమార్తెలతో కలిసి ముంబై బీచ్‌లో బోట్ షికారు చేశారు. బోటు ఒడ్డుకు వచ్చిన వెంటనే దిగుతున్న క్రమంలో అతను కాలుజారి పడగా, పెద్ద అలలు అతన్ని సముద్ర లోపలి వరకు నెట్టుకుంటూ తీసుకెళ్లింది. అక్కడే ఉన్న పోలీసులు సైతం అతన్ని కాపాడలేని పరిస్థితి ఏర్పడింది. మృతునికి భార్య సరిత 8 ఏళ్లలోపు ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఘటన నేపథ్యంలో ముంబై పోలీసులు మృతదేహాన్ని బయటకు తీసి శుక్రవారం సాయంత్రం పోస్టుమార్టం నిర్వహించారు. శనివారం రామాయంపేటకు మృతదేహం తీసుకురానున్నారు.

చెరువులో మునిగి విద్యార్థి..



సతీష్‌రావు మృతదేహం

అల్లాదుర్గం, జూన్ 13(ఆంధ్రజ్యోతి) : సరదాగా చేపలను పట్టేందుకు చెరువు వద్దకు వెళ్లిన ఈ విద్యార్థి ప్రమాదవశాత్తు నీటిలో మునిగి మృతిచెందిన సంఘటన శుక్రవారం అల్లాదుర్గం మండలం అప్పాజీపల్లి గ్రామంలో చోటుచేసుకుంది. గ్రామస్థులు, స్థానిక ఎస్ఐ శంకర్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. అప్పాజీపల్లి గ్రామానికి చెందిన ఘనపురం సాయిలు జీవనోపాధి కోసం తన కుటుంబంతో కలిసి హైదరాబాద్‌కు వెళ్లి జగద్గీర్‌గుట్టలో నివాసముంటున్నాడు. బడులకు వేసవి సెలవులో ఉండడంతో ఈ నెల 5న సాయిలు తన భార్య, ఇద్దరు పిల్లలతో స్వగ్రామమైన అప్పాజీపల్లికి వచ్చాడు. శుక్రవారం తన రెండో కుమారుడు సతీష్‌రావు(14) గ్రామ సమీపంలోని రేళ్లకుంటచెరువులో చేపలు పట్టేందుకు వెళ్లి ప్రమాదవశాత్తు నీటిలో మునిగి మృతిచెందాడు. సతీష్‌రావు కుకూట్‌పల్లిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతున్నాడు. సాయిలు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శంకర్ తెలిపారు.

స్విమ్మింగ్‌పూల్‌లో పడి వ్యక్తి..

గుమ్మడిదల, జూన్ 13 (ఆంధ్రజ్యోతి) : ప్రమాదవశాత్తు స్విమ్మింగ్ పూల్‌లో పడి వ్యక్తి మృతి చెందిన ఘటన శుక్రవారం అన్నారం గ్రామంలో చోటుచేసుకుంది. ఎస్ఐ భరత్ భూషణ్ తెలిపిన వివరాల ప్రకారం మేడ్చల్ జిల్లా గాగిల్లాపూర్‌కు చెందిన గులాం హుస్సేన్(38) తన ఇద్దరి పిల్లలతో కలిసి శుక్రవారం అన్నారం శివారులోని స్విమ్మింగ్ పూల్‌లో ఈతకు వచ్చాడు. ప్రమాదవశాత్తు హుస్సేన్ అందులో పడి ఊపిరాడక మృతి చెందాడు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

అల్లుడి మరణ వార్త విని అత్త..



వెంకటరమణ (ఫైల్), ఇందిర (ఫైల్)

హవేళిఘణపూర్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): భర్త సోదరుడి అల్లుడు గుండెపోటుతో మృతి చెందిన విషయం తెలిసి.. ఆమె కూడా గుండెపోటుతో మృతి చెందిన ఘటన మెదక్ జిల్లా హవేళి ఘనపూర్‌లో శుక్రవారం వెలుగులోకి వచ్చింది. గ్రామస్థుల కథనం ప్రకారం.. ముత్తాయిపల్లి గ్రామానికి చెందిన అయ్యగారి వెంకటేశ్వర్లు అన్న కుమార్తె సంధ్యారాణి భర్త వివరం వెంకటరమణ(50) భార్య, కుమార్తెతో కలిసి మెదక్‌లో నివాసముంటూ డిగ్రీ కళాశాలలో పని చేసేవాడు. ఇటీవల గజ్వేల్‌కు బదిలీపై వెళ్లాడు. గురువారం రాత్రి బాత్‌రూంకు వెళ్లిన వెంకటరమణకు గుండెపోటు రావడంతో అక్కడే పడిపోయాడు. కుటుంబసభ్యులు గమనించి, బయటకు తీసుకువచ్చేలోపే చనిపోయాడు. విషయాన్ని అయ్యవారి వెంటేశ్వర్లు భార్య ఇందిర(45)కు చెప్పగా, ఆమె స్పృహ తప్పి పడిపోయింది. వెంటనే ఆస్పత్రికి తరలించగా, ఆమెకూ గుండె పోటు వచ్చి మృతి చెందినట్లు డాక్టర్లు ధ్రువీకరించారు. వీరి అంత్యక్రియలు ముత్తాపల్లిలో నిర్వహించారు.

చెట్టుకు ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య



బేగరి రాజు మృతదేహం

పెద్దశంకరంపేట, జూన్ 13(ఆంధ్రజ్యోతి): వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన పెద్దశంకరంపేట మండల పరిధిలోని కొత్తపేట గ్రామంలో శుక్రవారం చోటు చేసుకుంది. పెద్దశంకరంపేట ఎస్ఐ ప్రవీణ్‌రెడ్డి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కొత్తపేట గ్రామానికి చెందిన బేగరి బాలమణితో ఝరాసంగం మండలం కక్కెర వాడ గ్రామానికి చెందిన బేగరి రాజు(32)కు 12 సంవత్సరాల క్రితం వివాహం జరిగింది. ఇల్లరికం వచ్చి ఇక్కడే ఉంటున్నాడు. గురువారం రాజు భూమి విషయమై తన సొంత గ్రామమైన కక్కెరవాడకు వెళ్లి తిరిగి కొత్తపేటకు వచ్చాడు. అక్కడ ఏం జరిగిందో తెలియదు కానీ అతడు శుక్రవారం ఉదయం కాలకృత్యాల కోసమని పొలం దగ్గరికి వెళ్లి చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

అనుమానాస్పద స్థితిలో రైతు..



ఆంజనేయులు (ఫైల్)

మనోహరాబాద్ జూన్ 13 (ఆంధ్రజ్యోతి): అనుమనాస్పద స్థితిలో రైతు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన మండల పరిధి వెంకటపూర్(అగ్రహారం) గ్రామంలో శుక్రవారం చోటు చేసుకుంది. ఎస్ఐ సుభాష్‌గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన చిన్నబత్తుల ఆంజనేయులు(35) గురువారం రోజుమాదిరిగానే తన పొలం వద్దకు వెళ్లి ఇంటికి తిరిగి రాలేదు. అతడి సోదరులు వెంకటేష్, శ్రీకాంత్ ఇంటికి రావడంతో ఆంజనేయులు భార్య నవనీత వాళ్లను అడగగా, పొలం వద్దనే ఉన్నాడని చెప్పారు. ఫోన్ చేసినా స్పందించకపోవడంతో అదే రాత్రి అక్కడికి వెళ్లి వెతికినా కనిపించలేదు. శుక్రవారం ఉదయం వారి పొలం చుట్టుపక్కల వెతకగా పక్కనే ఉన్న అడవిలో వేపచెట్టుకు ఉరేసుకుని కనిపించాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తూప్రాన్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. గతంలో తమ కుటుంబ సభ్యుల మధ్య భూముల విషయంలో గొడవలు జరిగాయని, తన భర్త మృతిపై అనుమానం ఉందని భార్య నవనీత పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

ఇంటి తాళం పగలగొట్టి చోరీ



దొంగల చేతిలో ధ్వంసమైన బీరువా

శివ్వంపేట, జూన్ 13(ఆంధ్రజ్యోతి) : గుర్తుతెలియని దుండగులు ఇంటి తాళాలు పగలగొట్టి వెండి ఆభరణాలు నగదు అపహరించుకు పోయిన సంఘటన శుక్రవారం శివ్వంపేటలో చోటు చేసుకుంది. బాధితురాలు తెలిపిన వివరాలు మేరకు మండల కేంద్రమైన శివ్వంపేటకు చెందిన కుంట మాధవి గురువారం ఇంటికి తాళం వేసి హత్నూరలో బంధువుల ఇంటికి జాతరకు వెళ్లింది. ఇదే అదునుగా భావించిన దుండగులు గురువారం రాత్రి ఇంటి తాళం పగలగొట్టి బీరువాలో ఉన్న 53 తులాల వెండి పట్ట గొలుసులు, కడియాలు, 16 వేల నగదును అపహరించుకు పోయారు. దొంగతనాన్ని గుర్తించిన బాధితురాలు శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేయడంతో వారు ఘటనా స్థలానికి ఆధారాలు సేకరించారు.

విమాన ప్రమాద మృతులకు నివాళి

హుస్నాబాద్ టౌన్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి) : అహ్మదాబాద్‌లో విమానం కుప్ప కూలిన ఘటన మృతులకు బీజేపీ నాయకులు నివాళులర్పించారు. శుక్రవారం హుస్నాబాద్ పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో గుజరాత్ మాజీ సీఎం విజయ్ రూపాని చిత్ర పటం ఏర్పాటు చేసి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. మాజీ సీఎం విజయ్ రూపాని మరణం బీజేపీకి తీరని లోటన్నారు. కార్యక్రమంలో బీజేపీ పట్టణ అధ్యక్షులు బత్తుల శంకర్‌బాబు, నాయకులు బొంగోని శ్రీధర్‌గౌడ్, వెల్దండి సంతోష్, అశాడపు శ్రీనివాస్, గాదాసు రాంప్రసాద్, కంది సతీష్ రెడ్డి, సాయికుమార్, అశోక్ తదితరులు ఉన్నారు.



నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు

స్ఫూర్తి ప్రదాతలు

నేడు ప్రపంచ రక్తదాతల దినోత్సవం


● రక్తమిచ్చి ప్రాణాలు కాపాడుతున్న దాతలు
● ఒక్కొక్కరు పదుల సార్లు రక్తదానం

కొండపాక/హుస్నాబాద్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి) : ప్రమాదాల్లో తీవ్రంగా గాయపడి ఆస్పత్రిలో చేరి సకాలంలో రక్తం అందక చనిపోయే వారు చాలామందే ఉన్నారు. ఇలాంటి సమయంలో మనమిచ్చే రక్తం ఎంతోమంది ప్రాణాలు కాపాడుతుంది. అందుకే అన్ని దానాల కన్నా రక్త దానం గొప్పది అంటుంటారు. అంతేకాదు ఇది ప్రాణదానంతో సమానం. ఈ నేపథ్యంలో ఎందరో దాతలు స్వచ్ఛందంగా ముందుకువచ్చి రక్తదానం చేస్తూ చేయిస్తూ స్ఫూర్తి ప్రదాతలు నిలుస్తున్నారు. ఎవరైనా ఆపదలో ఉండి రక్తం అవసరముందంటే చాలు క్షణాల్లో అక్కడికి చేరుకుని రక్తమిస్తున్న ఆపద్బాంధవులవుతున్నారు.

వాట్సాప్‌లో ప్రత్యేక గ్రూపులు...

రక్తదాతలు కొంతమంది వాట్సాప్ గ్రూపులు ఏర్పాటు చేసుకుని అనవరమైనవారికి రక్తదానం చేస్తున్నారు. సమాచారం అందిన వెంటనే ఏ గ్రూపు రక్తమైనా వ్యాట్సాప్ గ్రూప్‌లోని సభ్యులు వెళ్లి రక్తం ఇస్తూ దాతృత్వం చాటుకుంటున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా విస్తరించిన ఈ వాట్సాప్ గ్రూపులో 120 మంది వరకు రక్తదాతలు ఉన్నారు. వ్యాపారాత్మకం కాకుండా అవసరం ఉన్న వారికి మాత్రమే రక్తదానం చేస్తున్నారు.







రక్తదానం చేస్తున్న ప్రశాంత్, దాసరి చంద్రశేఖర్

యువతలో చైతన్యం అవసరం

రక్తదానంపై యువతలో ఇప్పటికీ అపోహలు ఉన్నాయి. పదే పదే రక్తమిస్తే అనారోగ్యం బారిన పడుతామోనన్న భయంతో ముందుకు రావడం లేదు. ' 18 నుంచి 55 ఏళ్ల మధ్య వయస్సుగల వారు రక్తం ఇవ్వవచ్చు.. ప్రతీ మూడు నెలలకోసారి రక్తం ఇవ్వడం వల్ల ఎలాంటి నష్టం ఉండదు.. రక్తం దానం చేసిన 24 గంటల్లోపు కోల్పోయిన శక్తి తిరిగి వస్తుంది.. మనిషిలో ఆరువేల మిల్లీ లీటర్ల రక్తం ఉంటుంది.. దాతల నుంచి 300 మిల్లీ లీటర్ల రక్తం మాత్రమే తీసుకుంటారు' అని వైద్యారోగ్యం నిపుణులు పలు మార్లు చెబుతున్నా యువతలో చైతన్యం రావడం లేదు. దీనిపై స్వచ్ఛంద, యువజన సంస్థలు పెద్ద ఎత్తున అవగాహన కార్యక్రమాలు చేపట్టాల్సిన అవసరం ఉంది.

పలుమార్లు రక్తదానం చేసినవారు..

● సిద్దిపేట పట్టణానికి చెందిన వరాల ప్రశాంత్‌కుమార్ వర్గల్ మండలంలో ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా పని చేస్తున్నాడు. 'జీతే జీతే రక్తదాన్, జాతే జాతే అవయవదాన్' అనే నినాదంతో రక్తదాన శిబిరాలు, అవయవదానంపై అవగాహన కార్యక్రమాలు చేపడుతూ ప్రజలను భాగస్వాములను చేస్తున్నాడు. ప్రశాంత్‌కుమార్ ఇప్పటివరకు 73 సార్లు రక్తదానం చేశాడు.

● సిద్దిపేటకు పట్టణానికి చెందిన దాసరి చంద్రశేఖర్ వన్ టౌన్ పోలీస్ స్టేషన్‌లో పోలీస్ కానిస్టేబుల్ విధులు నిర్వహిస్తున్నాడు. సుమారు 64 సార్లు రక్తదానం చేశాడు.

● పెద్దమాసాన్‌పల్లిలో పనిచేస్తున్న ప్రభుత్వ ఉపాధ్యాయుడు నిమ్మ శ్రీనివాస్‌రెడ్డి 31 సార్లు రక్తమిచ్చాడు. ఆయన రక్తం ఏబీ నెగిటివ్. ఇది అతి తక్కువ మందిలో ఉంటుంది.

● హుస్నాబాద్ మున్సిపాలిటీలో సాధారణ కార్మికుడిగా పని చేస్తున్న పైసా శ్రీకాంత్ ఇప్పటివరకు 60 సార్లు రక్తదానం చేశారు. తమకు వాట్సాప్ గ్రూప్ ఉందని, ఇందులో 200 మందిమి రక్తదాతలం ఉంటామన్నారు. 2023 సంవత్సరంలో ఢిల్లీలో జరిగిన బహుజన బంధువు అవార్డులలో ఉత్తమ సేవా అవార్డు తీసుకున్నారు.

14 సార్లు రక్తమిచ్చాను..



అత్యవసర పరిస్థితుల్లో ఉన్నవారికి రక్తం అందివ్వడం తన భర్త చంద్రశేఖర్ స్ఫూర్తి. ప్రాణాపాయ స్థితిలో ఉన్న వారికి సరైన సమయానికి రక్తం అందిస్తే వారు బతుకుతారు. ఆయన బాటలోనే నేనూ రక్తదానం చేస్తున్నాను. ఇప్పటివరకు 14 సార్లు రక్తమిచ్చాను.

-రేఖా ప్రియదర్శిని, సిద్దిపేట ప్రభుత్వ ఆసుపత్రి నర్సింగ్ అఫిసర్ సిద్దిపేట

ప్రాణాలు కాపాడానన్న సంతృప్తి..



రక్తం ఇచ్చి ప్రాణాలు కాపాడిన అనే సంతృప్తి అమూల్యమైనది. ప్రత్యేక శిబిరాలతో పాటు అవసరం ఉన్నవారికి రక్తం ఇస్తున్నాను. ఇప్పటికీ 34 సార్లు రక్తం ఇచ్చాను.

-గొడుగు రాజు, ముద్దాపూర్

రక్తదానమంటే ఇష్టం..



ఉన్నది ఒకటే జీవితం. ఎవ్వరికి నచ్చిన పని వారు చేస్తారు. నాకు ఆపదలో రక్తం లేక బాధ పడే వారికి బ్లడ్ ఇవ్వడం ఇష్టం. నాది బ్లడ్ గ్రూప్ ఓ నెగిటివ్. ఇప్పటి వరకు 19 సార్లు రక్తదానం చేశాను.

-పిన్న రమేశ్, గోవర్ధనగిరి

40 మంది మెడికోల రక్తదానం



సంగారెడ్డి అర్బన్, జూన్ 13(ఆంధ్రజ్యోతి) : ప్రపంచ రక్తదాన దినోత్సవం సందర్భంగా సంగారెడ్డిలోని ప్రభుత్వ మెడికల్ కాలేజీ వైద్య విద్యార్థులు శుక్రవారం రక్తదానం చేశారు. సంగారెడ్డిలోని జీజీహెచ్ బ్లడ్‌బ్యాంకులో 40 మంది మెడికోలు రక్తదానం చేశారు. సూపరింటెండెంట్ డా.అనిల్‌కుమార్ మాట్లాడుతూ రక్తదానం ప్రాణదానంతో సమానమని తెలిపారు. మంచి ఉద్దేశంతో మెడికోలు రక్తదానం చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఆర్‌ఎంవో డా.వీరాంజనేయులు, హాస్పిటల్ అడ్మినిస్ట్రేషన్ డా.సందీప్, మెడికల్ ఆఫీసర్ డా.గోవింద్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌బీఐలో..



సిద్దిపేట అర్బన్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా 70వ వార్షికోత్సవం సందర్భంగా సిద్దిపేట రీజనల్ ఆఫీస్ వారి ఆధ్వర్యంలో శుక్రవారం మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. 110 మంది రక్తదానం చేశారు. కార్యక్రమంలో రీజనల్ మేనేజర్ మారుతి, డాక్టర్ సునీల్ చౌదరి, ఆఫీసర్స్ అసోసియేషన్ ఏఒ, హైదరాబాద్ డిప్యూటీ జనరల్ సెక్రెటరీ నర్ర సంతోష్, యూనియన్ లీడర్ రామకృష్ణ, ఏఐఎస్ అసోసియేషన్ రీజినల్ సెక్రటరీ క్రాంతి, ఆఫీసర్స్ సంతోష్, బీమా, అనిల్ కుమార్, నరేష్ పాల్గొన్నారు.

వియత్నాం విద్యార్థులకు శిక్షణ ఇవ్వనున్న గీతం అధ్యాపకుడు



డాక్టర్ నిరంజన్ అప్పస్వామి

పటాన్‌చెరు రూరల్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి) : గీతం స్కూల్ ఆఫ్ టెక్నాలజీలోని సీఎస్‌ఈ విభాగం అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ నిరంజన్ అప్పస్వామి వియత్నాం విద్యార్థులకు సైబర్ సెక్యూరిటీపై శిక్షణ ఇవ్వనున్నారు. హోచిమిన్ సిటీలోని వియెన్ డాంగ్ కళాశాల సైబర్ సెక్యూరిటీపై రెండు వారాల కార్యశాల నిర్వహించడానికి ఆయనను అధికారికంగా ఆహ్వానించింది. దీనిని జూన్ 16 నుంచి జూలై 1, 2025 మధ్య నిర్వహించనున్నారు. వియత్నాంలో శిక్షణతో పాటు బోధించే అవకాశం అందుకున్న డాక్టర్ నిరంజన్‌ను గీతం ఉన్నతాధికారులు అభినందించి, అంతర్జాతీయ విద్యా కార్యకలాపాలలో ఆయన విజయం కొనసాగాలని అభిలాషించారు.

మూడేళ్లకు తెరుచుకున్న పాఠశాల



పాఠాలు బోధిస్తున్న టీచర్

తూప్రాన్, జూన్ 13(ఆంధ్రజ్యోతి): మెదక్ జిల్లా తూప్రాన్ మండలం వట్టూరు గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు ఉపాధ్యాయులు సక్రమంగా రాకపోవడంతో విద్యార్థులను ప్రైవేటులో చేర్పించారు. దాంతో విద్యార్థులు లేకపోవడంతో మూడేళ్ల క్రితం పాఠశాలను మూసివేశారు. బడిని తిరిగి తెరిపించాలని గ్రామస్థులు కొందరు కోరగా, మండల విద్యాధికారి డాక్టర్ పర్వతి సత్యనారాయణ చొరవతో గురువారం పునఃప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామస్థులతో సమావేశం నిర్వహించారు. శుక్రవారం 28 మంది విద్యార్థులను తల్లిదండ్రులు చేర్పించారు. వట్టూరు పాఠశాల ఉపాధ్యాయురాలు అఖిల విధులకు హాజరై విద్యార్థులకు తరగతులు బోధించారు. మూడేళ్లకు పాఠశాల పునఃప్రారంభం కావడంతో గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు.

దేశానికి కమ్యూనిస్టుల అవసరం ఉంది

● కేంద్ర ప్రభుత్వం ప్రజలను ఊహల్లో విహరింపజేస్తున్నది
● విమాన ప్రమాదంపై విచారణ జరిపించాలి
● సీపీఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కూనంనేని..



ఎడ్ల గురువారెడ్డి విగ్రహానికి నివాళులు అర్పిస్తున్న సాంబశివరావు

సిద్దిపేట అర్బన్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): దేశంలో ప్రజలకు కమ్యూనిస్టుల అవసరం ఉందని సీపీఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు పేర్కొన్నారు. కమ్యూనిస్టులను, మావోయిస్టులను అణచివేయాలని చూస్తున్న ప్రభుత్వం ప్రజా సమస్యలపై దృష్టి పెట్టాలని అన్నారు. సిద్దిపేట మొదటి ఎమ్మెల్యే సీపీఐకి చెందిన ఎడ్ల గురువారెడ్డి 14వ వర్ధంతి సందర్భంగా శుక్రవారం ఆయన విగ్రహానికి కూనంనేని పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రజలను ఊహల్లో విహరింపజేయిస్తోందన్నారు. విద్య, వైద్యం అందించడంలో పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. ఎయిర్ ఇండియా విమాన ప్రమాదం దురదృష్టకరమని, దీనిపై తగిన విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. 'కాళేశ్వరం డిజైన్ నేనే చేశాను.. అన్ని నేనే' అని చెప్పుకున్న కేసీఆర్ ఇప్పుడు తనకేమీ తెలియదు అనడం ఆశ్చర్యంగా ఉందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వాగ్దానాలను నెరవేర్చాలన్నారు. సీపీ దశాబ్ది ఉత్సవాలలో భాగంగా ఖమ్మంలో డిసెంబరు 26వ తేదీన 5 లక్షల మందితో భారీ సభ నిర్వహించనున్నామని తెలిపారు. ఆయన వెంట సీపీఐ జిల్లా కార్యదర్శి మంద పవన్, నాయకులు లక్ష్మణ్, శంకర్, బన్సీలాల్, ఆరీఫ్, సత్యనారాయణ, మల్లేశం, చంద్రం, ప్రసన్నకుమార్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

లాభసాటి వ్యవసాయంతోనే దేశ సమగ్రాభివృద్ధి

● జహీరాబాద్ ఎంపీ సురేష్‌కుమార్ షెట్కార్



మాట్లాడుతున్న జహీరాబాద్ ఎంపీ సురేష్‌కుమార్ షెట్కార్

కోహీర్, జూన్ 13: (ఆంధ్రజ్యోతి) : దేశంలో లాభసాటి వ్యవసాయం పెరిగినప్పుడే దేశ సమగ్రాభివృద్ధి సాధ్యమవుతుందని జహీరాబాద్ ఎంపీ సురేష్‌కుమార్ షెట్కార్ పేర్కొన్నారు. శుక్రవారం సంగారెడ్డి జిల్లా కోహీర్ మండలంలోని బిలాల్‌పూర్ రైతు వేదికల్లో నిర్వహించిన రైతు ముంగిట్లోకి-వ్యవసాయ శాస్త్రవేత్తలు ముగింపు కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. రైతు ముంగిట్లోకి శాస్త్రవేత్తలు అనే కార్యక్రమం ద్వారా రైతులకు పంటల సాగులో అందించిన మెళకువలు ఎంతగానో దోహదపడతాయన్నారు. జహీరాబాద్ ప్రాంతంలో చెరుకు రైతులను దృష్టిలో ఉంచుకొని ఇక్కడ మళ్లీ నూతన చక్కర పరిశ్రమను ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తానన్నారు. ఈ విషయాన్ని ఇప్పటికే ముఖ్యమంత్రికి దృష్టికి తీసుకెళ్లామన్నారు. అల్లం, ఆలుగడ్డ పంటల నిల్వ కొరకు కోల్డ్ స్టోరేజీలను ఏర్పాటు చేయాలని ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయ వైస్ చాన్స్‌లర్ జానయ్యను కోరారు. కలుపు తీసే యంత్రాలను సబ్సిడీ పై అందజేయాలని కోరారు. చదువుకున్న వారు కూడా వ్యవసాయం చేయాలని చూపాలని పీజేటీఏయూ వైస్ చాన్స్‌లర్ జానయ్య ఈ సందర్భంగా పేర్కొన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జహీరాబాద్ ఇన్‌చార్జి, మాజీ మంత్రి చంద్రశేఖర్, జిల్లా వ్యవసాయ అధికారి శివప్రసాద్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు రామలింగారెడ్డి, మాజీ జడ్పీటీసీ జి.రామదాసు, ఏఈఓ నవీన్‌కుమార్ తదితరులు ఉన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు వెంకటరెడ్డి

పేద ప్రజల పక్షాన పోరాడేది ఎర్రజెండానే

● సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకటరెడ్డి

హుస్నాబాద్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి) : పేద ప్రజల పక్షాన ఉంటూ వారి సమస్యలపై నిరంతరం పోరాడేది ఎర్రజెండానేనని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి అన్నారు. శుక్రవారం హుస్నాబాద్ పట్టణంలోని అనభేరి, సింగిరెడ్డి భవనంలో ఈ నెల 27వ తేదీన నిర్వహించే సీపీఐ జిల్లా మహాసభల ఆహ్వాన సంఘ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కేంద్రంలోని మోది ప్రభుత్వం ఆపరేషన్ కగార్ పేరుతో మావోయిస్టులను అతి కిరాతకంగా చంపుతూ, ఆదివాసీలను చిత్రహింసలకు గురి చేస్తున్నదని తెలిపారు. దేశంలో స్వేచ్ఛ, స్వాతంత్ర్యం, హరించబడుతున్న హక్కుల కోసం పోరాడుతున్న మవోయిస్టులను చంపడమేమిటని ప్రశ్నించారు. వెంటనే ఆపరేషన్ కగార్‌ను నిలిపివేయాలని డిమాండ్ చేశారు. అనంతరం జిల్లా మహాసభల ఆహ్వాన సంఘం అధ్యక్షుడు సీపీఐ జిల్లా కార్యదర్శి మంద పవన్, ఆహ్వాన సంఘం ప్రధాన కార్యదర్శిగా హుస్నాబాద్ మండల కార్యదర్శి మల్లేశ్, ఉపాధ్యక్షులుగా సత్యనారాయణగౌడ్, వెంకటరెడ్డి, లక్ష్మణ్, శంకర్, వనేష్, అశోక్, కోశాధికారిగి ఎగ్గోజు సుదర్శనచారిలను నియమించారు. సీపీఐ హుస్నాబాద్ మండల కార్యదర్శిగా గడిపె మల్లేశ్ మరోసారి ఎన్నుకున్నారు. పట్టణ కార్యదర్శిగా సుదర్శనచారిని ఎన్నుకున్నారు.

డీఈఐసీని సందర్శించిన యూనిసెఫ్ బృందం

● చిన్నారులకు అందించే వైద్య సేవలపై ఆరా



సంగారెడ్డిలోని డీఈఐసీ సెంటర్‌ను సందర్శించిన యూనిసెఫ్ బృందం

సంగారెడ్డి అర్బన్/కొండాపూర్, జూన్ 13(ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డి జీజీహెచ్ ప్రాంగణంలోని డిస్ట్రిక్ట్ ఎర్లీ ఇంటర్‌వెన్షన్ సెంటర్(డీఈఐసీ)ను శుక్రవారం యూనిసెఫ్ బృందం సందర్శించింది. యూనిసెఫ్ ప్రతినిధులు డా.జలీమ్‌టఫెసి, డా.శ్రీధర్, డా.సీమ, డా.కిరణ్‌లతో కూడిన బృందం డీఈఐసీలో పలు విభాగాలను కలియ తిరిగి పరిశీలించారు. చిన్నారులకు అందిస్తున్న వైద్య సేవలపై ఆరా తీశారు. డీఈఐసీకి ఎటువంటి సమస్యలతో చిన్నారులు వస్తుంటారు, ఎక్కడి నుంచి వస్తారు, ఎవరు తీసుకొస్తారు, చికిత్స విధానాలు, రెఫర్ తదితర వివరాలను క్షుణంగా అడిగి తెలుసుకున్నారు. యూనిసెఫ్ బృందం సభ్యులు అడిగిన ప్రశ్నలకు డీఈఐసీ వైద్యులు, సిబ్బంది సవివరంగా సమాధానాలిచ్చారు. అలాగే కొండాపూర్ మండలం గొల్లపల్లి అంగన్‌వాడీ కేంద్రాన్ని యూనిసెఫ్ బృందం సందర్శించింది. కేంద్రాలలో నిర్వాహకుల పనితీరు సేవలను అడిగి తెలుసుకున్నారు. సంపూర్ణ పౌష్టకహారంతో పాటు వారానికి రెండు రోజుల ఎగ్ బిర్యాన్ని అందిస్తున్న విషయాన్ని పోషకులకు తెలిసేలా విస్తృత ప్రచారం చేయాలన్నారు. కొత్తగా అడ్మిషన్ తీసుకున్న చిన్నారులకు తల్లులచే సీడీపీవో చంద్రకళ, సూపర్‌వైజర్ శ్యామల అక్షరాభ్యాసం చేయించారు. ఆయా కార్యక్రమంలో డీఐవో డా.మనోహర్‌రెడ్డి, పీడీయాట్రిక్స్ డా.మధుసుధన్‌రెడ్డి, యూనిసెఫ్ బృందం సభ్యులు కిరణ్, సిమన్‌శ్రీధర్, జిలలీమ్, అంగన్‌వాడీ టీచర్లు అరుణ, శ్యామల, అయాలు అనిత, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయిలో సిద్దిపేట అధ్యాపకుడి ప్రతిభ



అధ్యాపకుడు సయ్యద్ సంధాని

సిద్దిపేట కల్చరల్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి) : జాతీయ స్థాయిలో ప్రచురితమైన సక్సెస్‌ఫుల్ స్కూల్ లీడర్‌షిప్ 2025-26 మ్యాగజైన్‌లో సిద్దిపేట జిల్లాకు చెందిన అధ్యాపకుడు సయ్యద్ సందాని ప్రతిభ ప్రచురితమైంది. జాతీయ స్థాయిలో న్యూఢిల్లీలో జరిగిన ఎగ్జాంపుల్స్ ఆఫ్ చేంజ్ అండ్ ఇన్నోవేషన్ 2025 అనే జాతీయస్థాయి సదస్సులో పాల్గొని తన వినూత్న బోధన విధానాన్ని ప్రదర్శించినందుకు గాను జాతీయస్థాయి మ్యాగజైన్‌లో సిద్దిపేటకు చెందిన సయ్యద్ సంధాని చోటు సంపాదించారు. ప్రతి సంవత్సరం దేశవ్యాప్తంగా బోధనలో నిష్ణాతులైన ప్రతిభావంతులైన ఉపాధ్యాయుల ప్రతిభను వారు చేసే విద్యా విషయక వినూత్న కార్యక్రమాలను జాతీయస్థాయి మ్యాగజైన్‌లో ప్రచురిస్తారు. ఈ సంవత్సరం 57 మంది ఉపాధ్యాయులు పాల్గొనగా వారిలో సంధాని కూడా ఉన్నారు. ఈ సందర్భంగా సయ్యద్ సంధానికి జిల్లా విద్యాధికారులు, మండల విద్యాధికారులు, అధ్యాపకులు అభినందనలు తెలిపారు.



ఆరుద్ర ఆగమనం

ఆరుద్ర పురుగులు రాక రైతులకు శుభసూచకమని అంటుంటారు. శుక్రవారం పాపన్నపేట మండంలో ఆరుద్ర పురుగులు కబడడంతో అన్నదాతలు ఆనందం వ్యక్తం చేశారు. చూడటానికి అరుణ వరుణంలో చాలా ముచ్చటగా ఉండడంతో పలువురు ఆసక్తిగా చూశారు. కేవలం ఆరుద్ర కార్తెలో మాత్రమే ఇవి కనిపించనుండడంతో వీటికి ఆ పేరు వచ్చినట్లు చెప్పుకుంటారు. ఇవి రైతులకు ఎంతో మేలు చేస్తాయి. పర్యావరణ నేస్తాలుగా వీటిని పిలుస్తారు. ఇవి నేలల్లోని చీడ పురుగుల లార్వాలను తిని పంట వేయకముందే రైతుకు మేలు చేకూరుస్తాయి. ఇవి పొలంలో కనిపిస్తే. రైతులు ఎంతో సంబరపడిపోతారు.

- పాపన్నపేట , జూన్ 13 (ఆంధ్రజ్యోతి)



వర్గల్‌లో నిరుపయోగంగా ఆర్‌అండ్ బీ అతిథి గృహం



ధ్వసంమైన కిటికీఅద్దాలు



అతిథి గృహం ఆవరణలో ఖాళీ మద్యం సీసాలు, ప్లాస్టిక్ గ్లాసులు



శిథిలావస్థకు చేరుకున్న ఫర్నిచర్

అసాంఘిక కార్యక్రమాలకు 'అతిథి' గృహం

వర్గల్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి) : వర్గల్ మండల కేంద్రంలోని విద్యా సరస్వతీ అమ్మవారి ఆలయ సమీపంలో ఏళ్ల క్రితం నిర్మించిన ఆర్‌అండ్ బీ అతిథి గృహం నిర్వహణ లోపంతో శిథిలావస్థకు చేరుకుంటున్నది. విద్యాధరి క్షేత్రంలోని విద్యా సరస్వతీ అమ్మవారి ఆలయానికి భక్తులు, పర్యాటకులు అధికంగా వస్తుండటంతో కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో అప్పటి పర్యాటక శాఖ మంత్రి డా.గీతారెడ్డి సుమారు రూ.కోటితో 18 ఏళ్ల క్రితం నిర్మించి ప్రారంభించారు. అయినా ఇప్పటికీ వినియోగించడంలేదు. దీంతో ఈ భవనం తలుపులు, కిటికీలు, వస్తువులు, ఫర్నిచర్, సామగ్రి పూర్తి ధ్వంసమయ్యాయి. ప్రభుత్వం మారిన ప్రతిసారి కొందరు సంబంధిత శాఖ అధికారులు ప్రహరీ సక్రమంగా లేదని, వాస్తు దోషం ఉందన్న కారణంతో చిన్న చిన్న మరమ్మతులు చేయిస్తూ వస్తున్నా వినియోగంలోకి మాత్రం తేవడంలేదు. దీంతో ఇందులోని నల్లాలు, వాటర్ ట్యాంకు, ఎలక్ట్రికల్ బల్బులు, ఫ్యాన్లు దుండగులు దోచుకెళ్లారు. అంతేకాకుండా తాగుబోతులకు, ఆసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారింది. ఇప్పటికైనా అధికారులు స్పందించి అతిథి గృహానికి మరమ్మతులు చేసి వినియోగంలోకి తేవాలని ప్రజలు కోరుతున్నారు

న్యూస్ బాక్స్

రుద్రారంలో వశిష్ట కో హైస్కూల్ సీజ్

పటాన్‌చెరు రూరల్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి) : రుద్రారంలో వశిష్ట కో హైస్కూల్‌ను శుక్రవారం పటాన్‌చెరు ఎంఈవో నాగేశ్వర్ నాయక్ సీజ్ చేశారు. ఎటువంటి అనుమతులు లేకుండా ఏర్పాటు చేస్తున్న ఈ హైస్కూర్‌లో ఇప్పటికే 245 మంది విద్యార్థులు అడ్మిషన్‌లు తీసుకున్నారని, అనుమతులు లేని పాఠశాలల్లో తమ పిల్లలను జాయిన్ చేయటం వల్ల విద్యా సంవత్సరం నష్టపోవటంతో పాటు ఆర్థికంగా కూడా నష్టపోతారని నాగేశ్వరరావు తెలిపారు.

యోగాతో గర్భిణులకు ప్రయోజనం

తూప్రాన్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): గర్భిణులు యోగా చేయడం వల్ల ఎంతో ప్రయోజనముంటుందని ఆరోగ్య నిపుణులు పేర్కొన్నారు. తూప్రాన్ పట్టణంలోని సామాజిక ఆరోగ్య కేంద్రంలో శుక్రవారం 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా గర్భిణులతో యోగాసనాలు వేయించారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ అమర్‌సింగ్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఖేడ్‌లో వర్షం

నారాయణఖేడ్, జూన్ 13(ఆంధ్రజ్యోతి): నారాయణఖేడ్‌లో శుక్రవారం సాయంత్రం ఉరుములు, మెరుపులతో అరగంట పాటు భారీగా వర్షం కురిసింది. వర్షం వల్ల ఖేడ్ పట్టణంలోని రోడ్లపై వరద నీరు భారీగా ప్రవహించింది.

నేడు విద్యుత్ అంతరాయం

మెదక్ అర్బన్, జూన్ 13(ఆంధ్రజ్యోతి): విద్యుత్ మరమ్మతుల కారణంగా శనివారం పట్టణంతోపాటు మెదక్, హావేళిఘణపూర్, చిన్నశంకరంపేట మండలాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని ట్రాన్స్‌కో ఏడీ, ఏఈలు నవీన్‌కుమార్, రాజ్‌కుమార్ తెలిపారు.

చౌటకూర్ కేజీబీవీలో కాంట్రాక్టు సిబ్బంది నియామకానికి నోటిఫికేషన్

పుల్‌కల్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): చౌటకూర్ కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం (కేజీబీవీ)లో కాంట్రాక్టు సిబ్బంది నియామకానికి నోటిఫికేషన్ జారీ చేస్తున్నట్లు విద్యాలయం ప్రత్యేక అధికారి ఎం.నాగరాణి తెలిపారు. కస్తూర్బాలో అటెండర్-1, డే, నైట్ వాచ్‌మెన్-2, హెడ్ కుక్ -1 ఖాళీలు ఉన్నాయన్నారు. ఈ పోస్టులకు పదవ తరగతి ఉత్తీర్ణులైన ఉండాలని, అలాగే, అసిస్టెంట్ కుక్-2, స్వీపర్ -1 పోస్టులకు 7 వ తరగతి ఉత్తీర్ణులై 18-45 ఏళ్ల వయస్సు గల మహిళలు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. పూర్తి వివరాల కోసం 7416243609 సంప్రదించాలని ప్రత్యేక అధికారి నాగరాణి తెలిపారు.

ఖేడ్‌లో ఆర్ఏఎఫ్ కవాతు

నారాయణఖేడ్, జూన్ 13(ఆంధ్రజ్యోతి): నారాయణఖేడ్ పట్టణంలో శుక్రవారం సాయంత్రం ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్ (ఆర్‌ఏఎఫ్) బలగాలు కవాతు నిర్వహించాయి. ఆర్ఏఎఫ్ బలగాలు ప్రత్యేక వాహనాల్లో నారాయణఖేడ్ చేరుకోగానే, స్థానిక డీఎస్పీ వెంకట్‌రెడ్డి స్వాగతం పలికారు. అనంతరం బలగాలు పట్టణంలోని వివిధ ముఖ్యమైన స్థలాలు ప్రధాన రహదారులు, వ్యాపార కూడళ్లలో కవాతు నిర్వహించారు.

పోలింగ్ కేంద్రాల్లో అన్ని సౌకర్యాలు కల్పించాలి

నిజాంపేట, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల సమయంలో పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లకు ఇబ్బందులు తలెత్తకుండా అన్ని రకాల సౌకర్యాలు కల్పించాలని మెదక్ ఆర్డీవో రమాదేవి పేర్కొన్నారు. మండల పరిధిలోని వెంకటాపూర్(కే)గ్రామంలో శుక్రవారం రోజున నూతన పోలింగ్ కేంద్రాన్ని సందర్శించి పరిశీలించారు.

పీఏసీఎస్ డైరెక్టర్ మృతి పట్ల సంతాపం

హత్నూర, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): హత్నూర మండల పరిధిలోని గుండ్లమాచునూర్ గ్రామానికి చెందిన పీఏసీఎస్ డైరెక్టర్ బేగరి సాయిలు మృతి పట్ల హత్నూర సహకార సంఘం సభ్యులు శనివారం సంతాపం తెలిపారు. ఈ సందర్భంగా రెండు నిమిషాలు మౌనం పాటించి సంతాపం ప్రకటించారు.

మంత్రి 'వాకిటి'కి ఎంపీ సన్మానం

నారాయణఖేడ్, జూన్ 13(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర పశుసంవర్ధక శాఖ, క్రీడలు, యువజన శాఖల మంత్రిగా బాధ్యతలు చేపట్టిన వాకిటి శ్రీహరిని శుక్రవారం ఎంపీ సురేష్ షెట్కార్ హైదరాబాద్‌లోని మినిస్టర్ క్వార్టర్స్‌లో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎంపీ మంత్రికి పుష్పగుచ్ఛాన్ని అందించి ఘనంగా సన్మానించారు. వెంట దిశా కమిటీ సభ్యులు ప్రకాష్‌రాథోడ్, హన్మంత్‌రావు, పీకే.రావు, రవి ఉన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ

సంగారెడ్డి టౌన్, 13 (ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ శుక్రవారం తన క్యాంపు కార్యాలయంలో లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. కొండాపూర్, కంది, సంగారెడ్డి మునిసిపాలిటీ, సంగారెడ్డి మండలాలకు చెందిన 57 మంది మందికి రూ. కోటికి పైగా విలువ చేసే చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు.

మొక్కలు నాటిన బీజేపీ నాయకులు

సిర్గాపూర్/కల్హేర్, జూన్ 13(ఆంధ్రజ్యోతి): కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం ఏర్పాటై 11 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా సిర్గాపూర్, కల్హేర్ మండలాల బీజేపీ నాయకులు శుక్రవారం మొక్కలు నాటారు. సిర్గాపూర్‌లోని మల్లన్న ఆలయ ఆవరణలో మొక్కలు నాటారు. పార్టీ నాయకులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.




బాబోయ్.. ఇదేం కంపు?

సంగారెడ్డి జిల్లా కొండాపూర్ మండలంలోని మల్కాపూర్ వద్ద 65వ నంబర్ జాతీయ రహదారి పక్కన చెత్తాచెదారం పేరుకుపోయింది. ఇక్కడే జంతువుల వ్యర్థాలను పారేయడంతో దుర్గంధం వెదజల్లుతున్నది. ఈ రోడ్డుపై నుంచి ప్రయాణించే వారు కంపును భరించలేకపోతున్నారు. సంగారెడ్డి పట్టణంలో బొబ్బిలికుంట ప్రాంతంలో మురికి కాలువలో పందుల బెడద ఎక్కువైంది. వర్షాకాలం ఎలాంటి రోగాలు ప్రబలుతాయోనని జనం ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా ఏ మాత్రం పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి చెత్తాచెదారం, మురికిని తొలగించాలని కోరుతున్నారు.

- ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్ సంగారెడ్డి జిల్లా, జూన్ 13

ఆస్తిపన్ను వసూళ్లలో అక్రమాలపై..

తూతూ మంత్రంగా విచారణ

- సీడీఎంఏ అధికారుల బృందం విచారణపై అనుమానాలు
- బృందం వెంటే దర్జాగా వచ్చిన ఆరోపణలు ఎదుర్కొంటున్న అధికారి
- ఫిర్యాదుదారుడిపై ప్రశ్నల వర్షం

సదాశివపేట, జూన్ 13: (ఆంధ్రజ్యోతి): బల్దియాలో ఆస్తి పన్ను వసూళ్లల్లో జరుగుతున్న అక్రమాలపై ఫిర్యాదు చేసిన ఓ సామాన్యుడికి చేదు అనుభవం ఎదురైంది. ఈ వ్యవహారంలో న్యాయం జరగడం ప్రశ్నార్థకంగా మారిందనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. నిబంధనల ప్రకారం బల్దియాకు రావాల్సిన ఇళ్లు, బహుళ అంతస్తుల భవన సముదాయాలు, షాపింగ్‌మాల్స్, కార్పొరేట్ స్థాయి హస్పిటల్స్, భారీ కమర్షియల్ భవనాల ఆస్తి పన్నులను సగం మేరకు తగ్గించి మిగితా సొమ్మును కొంతమంది బల్దియా అధికారులు తమ జేబుల్లో వేసుకుంటున్నట్టు ఆరోపిస్తూ పట్టణానికి చెందిన ఓ పౌరుడు కొద్ది రోజులు క్రితం మున్సిపల్ రాష్ట్రస్థాయి అధికారులకు ఆధారాలతో ఫిర్యాదు చేశాడు. ఏటా బల్దియాకు ఆస్తి పన్నుల నుంచి రావాల్సిన రూ. కోట్లలో ఆదాయానికి గండి పడుతుందని ఫిర్యాదుదారుడు ట్యాక్స్‌ల వసూళ్లల్లో 'ఆన్‌లైన్' వేదికగా చోటు చేసుకున్న అక్రమాలను మున్సిపల్ శాఖ రాష్ట్ర అధికారుల దృష్టికి తీసుకెళ్లాడు. ఇంతవరకు అన్నీ బాగానే ఉన్నా.. సీన్ కట్ చేస్తే ఫిర్యాదు అందుకున్న (కమిషనర్, డైరెక్టర్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్) సీడీఎంఏ అధికారుల బృందం ఈ నెల 12న పట్టణంలో విచారణకు దిగింది. విచారణకు వచ్చిన బృందం తమ ప్రశ్నలతో ఫిర్యాదుదారుడిని ఉక్కిరి బిక్కిరి చేసినట్టు సమాచారం. సదాశివపేట బల్దియాలో షాపింగ్‌మాల్స్, భారీ కమర్షియల్ భవనాల నుంచి రూ.లక్షల్లో వసూలు చేయాల్సిన ఆస్తి పన్నును రెవెన్యూ విభాగంలో ఓ అధికారి కేవలం రూ.వేలు, రూ.వందల్లో ఆస్తి పన్నులు విధించి అవినీతికి పాల్పడినట్టు ఫిర్యాదుదారుడు (సీడీఎంఏ) అధికారులకు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు అందజేశాడు. విచారణ వచ్చిన సీడీఎంఏ అధికారుల బృందం ఆరోపణలు ఎదుర్కొంటున్న సదరు రెవెన్యూ విభాగం అధికారిని దర్జాగా వెంటబెట్టుకుని విచారణ ప్రారంభించినట్టు తెలుస్తున్నది. పట్టణంలో వందల సంఖ్యలో భవనాలకు సంబంధించిన ఆస్తి పన్నులు బల్దియా ఖజాలో జమకాకుండా పక్కదారి పట్టాయని ఫిర్యాదు దారుడు ఆధారాలు చూపిస్తున్నా విచారణకు వచ్చిన అధికారుల బృందం మాత్రం పట్టణంలో రెండు మూడు భవనాల వద్దకు మాత్రమే వెళ్లి తూతూ మంత్రంగా విచారణ పూర్తి చేసి వెళ్లిపోవడంపై పట్టణ ప్రజలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఫిర్యాదుదారుడు ఆరోపించిన భవనాల వద్దకు కాకుండా విచారణ అధికారుల బృందం ఇతర భవనాల ఆస్తి పన్నుల వివరాలను సేకరించడం పలు అనుమానాలకు తావిస్తున్నది. గతంలో సదాశివపేట బల్దియాలో ఉన్నతాధికారిగా పనిచేసి కొన్నేళ్ల క్రితం రిటైర్మెంటు పొందిన ఓ అధికారి తిరిగి విచారణ అధికారుల బృందంలో ఓ సభ్యుడిగా ఉండడం అనుమానాలను రేకెత్తిస్తున్నాయి.

ఇందిరమ్మ ఇళ్లపై అపోహలు వద్దు



కంగ్టిలో ఇందిరమ్మ లబ్ధిదారులకు మంజూరు పత్రాలు అందజేస్తున్న ఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి

కంగ్టి/నారాయణఖేడ్/పెద్దశంకరంపేట, జూన్ 13(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్లపై, ప్రతి పక్షాలు, గిట్టని వారు చేసే ఆరోపణలను నమ్మవద్దని, ఇల్లు నిర్మించుకునే లబ్ధిదారులకు తప్పకుండా బిల్లులు ఇప్పించే బాధ్యత నాదేనని ఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం మండల కేంద్రంమైన కంగ్టిలో లబ్ధిదారులకు ఇళ్ల మంజూరు పత్రాలు అందజేసి మాట్లాడారు. ఎన్ని అవాంతరాలు ఎదురవుతున్నా సీఎం రేవంత్‌రెడ్డి ప్రజా సంక్షేమం కోసం ఒక్కో పథకాన్ని సమర్థవంతంగా అమలు చేస్తున్నామన్నారు. అనంతరం తడ్కల్, ఎడ్ల రేగడి తండాలలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి భూమి పూజ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో సత్తయ్య, ఎంపీవో సుభాష్, మాజీ ఎంపీపీలు పండరినాథ్‌రావు, నాగన్న, మనోజ్‌పాటిల్, నర్సింలు, తదితరులు పాల్గొన్నారు. బడిబాట కార్యక్రమంలో భాగంగా నారాయణఖేడ్ పట్టణంలోని మంగల్‌పేట ప్రాథమిక పాఠశాల, పెద్దశంకరంపేటలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో ఎమ్మెల్యే శుక్రవారం చిన్నారులచే అక్షరాభ్యాసాన్ని చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పేద చిన్నారుల కోసం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ప్రీప్రైమరీ తరగతులను ప్రభుత్వం త్వరలో ప్రారంభించనుందని తెలిపారు. ఆయా కార్యక్రమాలో ఎంఈవోలు విశ్వనాథ్, వెంకటేశం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. అనారోగ్యంతో చికిత్స పొందుతున్న నాగల్‌గిద్ద మండలం కరసగుత్తికి చెందిన జయశ్రీకి సీఎంఆర్ఎఫ్ ద్వారా మెరుగైన చికిత్స కోసం రూ.2.50 లక్షల విలువైన ఎల్‌వోసీ పత్రాలను ఎమ్మెల్యే సంజీవరెడ్డి శుక్రవారం జయశ్రీ తండ్రి రమేష్‌కు అందజేశారు.

ఫౌండేషన్ సేవలను మరింత విస్తృతం చేయాలి



జాన్ ఫౌండేషన్ పాఠశాలను ప్రారంభిస్తున్న 'ఆవుల'

మాసాయిపేట జూన్ 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రామంతపూర్ గ్రామంలో నెలకొల్పిన జాన్ ఫౌండేషన్ పాఠశాలను నర్సాపూర్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి ఆవుల రాజిరెడ్డి శుక్రవారం ప్రారంభించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల విద్యార్థులకు, నిరుపేదలకు ఉచితంగా నాణ్యమైన విద్యను అందిస్తున్న జాన్ ఫౌండేషన్ సేవలు అభినందనీయమని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతంలో యువతకు ఉపాధి లభించేలా నూతన కోర్సులను ప్రవేశపెట్టి శిక్షణను సైతం అందించాలని ఫౌండేషన్‌వారిని కోరారు. ఇందుకు తాము సహకరిసామన్నారు. అనంతరం మాసాయిపేటలోని భూభారతి రెవెన్యూ సదస్సులో ఆళ్ల రాజిరెడ్డి పాల్గొని పలు గ్రామాల ప్రజల విజ్ఞప్తులను స్వీకరించారు. భూభారతి సదస్సులను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని గ్రామస్థులకు సూచించారు. కార్యక్రమంలో ఎమ్మార్వో జ్ఞానజ్యోతి, డిప్యూటీ ఎమ్మార్వో వసంత, రెవెన్యూ సిబ్బంది, వివిధ గ్రామాల ప్రజలు పాల్గొన్నారు

అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు



జహీరాబాద్‌లో ఇందిరమ్మ ఇంటి పనులకు భూమిపూజ చేస్తున్న ఎంపీ సురేష్‌కుమార్‌షెట్కార్, తదితరులు

జహీరాబాద్/పుల్‌కల్/అల్లాదుర్గం/వెల్దుర్తి, జూన్ 13(ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి, మెదక్ జిల్లాల్లోని పలు గ్రామాల్లో శుక్రవారం ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులకు భూమిపూజలు చేసి ప్రారంభించారు. పలు చోట్ల ఇందిరమ్మ ఇళ్లమంజూరు పత్రాలను లబ్ధిదారులకు అందజేశారు. జహీరాబాద్ పట్టణంలోని శాంతినగర్, డ్రైవర్ కాలనీల్లో జహీరాబాద్ ఎంపీ సురేష్ షెట్కార్, సెట్విన్ కార్పొరేషన్ చైర్మన్ గిరిధర్‌రెడ్డి, మాజీమంత్రి డా.చంద్రశేఖర్ తదితరులు ఇందిరమ్మ లబ్ధిదారులకు ఇళ్లపట్టాలను అందజేసి ఇళ్లకు భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయాప్రాంతాల్లో ఏర్పాటుచేసిన కార్యక్రమాల్లో వారు పాల్గొని మాట్లాడుతూ.. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేయనున్నట్టు తెలిపారు. పుల్‌కల్ మండలంలోని గొంగ్లూరు గిరిజన తండాలో ఇందిరమ్మ ఇళ్లు మంజూరు కావడంతో శుక్రవారం ఆ ఇంటి నిర్మాణ పనులను డీసీసీబీ మాజీ డైరెక్టర్, కాంగ్రెస్ సీనియర్ నేత రామచంద్రారెడ్డి ప్రారంభించారు. చౌటకూర్ మండలంలోని చక్రియాల గ్రామంలో జోగిపేట వ్యవసాయ డివిజన్ ఆత్మ కమిటీ చైర్మన్ తిమ్మారెడ్డి మల్లారెడ్డి, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు నత్తి దశరథ్‌లు ఇందిరమ్మ ఇంటి నిర్మాణ పనులను ప్రారంభించారు. మెదక్ జిల్లా అల్లాదుర్గం మండలంలోని బహిరన్‌దిబ్బ, సీతానగర్, ముప్పారం తదితర గ్రామాల్లో మంజూరైన ఇందిరమ్మ ఇళ్లకు హౌసింగ్ ఏఈ కౌశిక్‌తో కలసి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కొప్పుల శేషారెడ్డి పనులను ప్రారంభించారు. ఆయా కార్యక్రమాల్లో స్థానిక అధికారులు, నాయకులు పాల్గొన్నారు. వెల్దుర్తి మండలకేంద్రంతో పాటు కుకునూర్ గ్రామంలో కాంగ్రెస్ నాయకులు శుక్రవారం పలువురు లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలను అందజేశారు. వెల్దుర్తి మండల కేంద్రంలో 71 మంది, కుకునూర్‌లో 30 మందికి మంజూరు పత్రాలను అందజేసినట్టు వారు తెలిపారు.

నిరక్షరాస్యత నిర్మూలనకు కృషి: డీఈవో

సంగారెడ్డి అర్బన్, జూన్ 13(ఆంధ్రజ్యోతి): 'ఉల్లాస్' కార్యక్రమం ద్వారా సమాజంలో నిరక్షరాస్యత నిర్మూలనకు కృషి జరుగుతుందని సంగారెడ్డి డీఈవో వెంకటేశ్వర్లు తెలిపారు. సంగారెడ్డిలోని జిల్లా సమాఖ్య కార్యాలయంలో మండల టెక్నీషియన్స్‌కు నిర్వహించిన ఒక రోజు శిక్షణ కార్యక్రమంలో ఆయన హాజరై మాట్లాడారు. డీఆర్డీఏ సిబ్బంది పూర్తిస్థాయిలో పాల్గొని అన్ని మండలాల్లో సర్వే నిర్వహించి ఉల్లాస్ యాప్‌లో నమోదు చేయాలని సూచించారు. కార్యక్రమంలో వయోజన విద్య పీవో వెంకట్‌రెడ్డి, ఓపెన్ స్కూల్ జిల్లా కో ఆర్డినేటర్ వెంకటస్వామి, ఏపీవో మురళి, డీఆర్డీఏ ఏపీడీ జంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల్లో ఉచిత విద్య

కంది/మునిపల్లి, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడిల్లో ఆటపాటలతో కూడిన ప్రీస్కూల్ విద్యను ఉచితంగా నేర్పిస్తారని అజీ ఫౌండేషన్ ప్రతినిధి ప్రదీప్ అన్నారు. శుక్రవారం ఆయన కందిలోని అంగన్‌వాడి కేంద్రంలో బాలింతలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రెండున్నరేళ్లు నిండిన చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పిస్తే చదువుతో పాటు పౌష్టికాహారం అందిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ సాయి శంకర్, అంగన్‌వాడీ టీచర్లు తదితరులు పాల్గొన్నారు. మున్సిపల్లి మండలంలోని పెద్ద చెల్మెడ అంగన్‌వాడీ- కేంద్రంలో అంగన్‌వాడీ టీచర్ రేణుక ఆధ్వర్యంలో అమ్మమాట-అంగన్‌వాడీ బాట కార్యక్రమంలో భాగంగా శుక్రవారం నాడు ఇంటింటి ప్రచారం నిర్వహించి పిల్లల తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం కృష్ణ, అంగన్‌వాడీ టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

సర్కారు బడుల్లో సామూహిక అక్షరాభ్యాసాలు



సంగారెడ్డి పోతిరెడ్డిపల్లి ఎంపీపీఎస్‌లో చిన్నారితో అక్షరాలను దిద్దిస్తున్న అదనపు కలెక్టర్ చంద్రశేఖర్



మెదక్ జిల్లా నిజాంపేట చల్మెడ పాఠశాలలో చిన్నారితో అక్షర స్వీకారం చేయిస్తున్న మెదక్ డీఈవో రాధాకిషన్

సంగారెడ్డి అర్బన్/జహీరాబాద్/రామచంద్రాపురం టౌన్/కల్హేర్/సిర్గాపూర్/వట్‌పల్లి, జూన్ 13(ఆంధ్రజ్యోతి): బడిబాట కార్యక్రమంలో భాగంగా సంగారెడ్డి, మెదక్ జిల్లాల్లోని పలు ప్రభుత్వ పాఠశాలల్లో శుక్రవారం చిన్నారులతో సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమాలను నిర్వహించారు. సంగారెడ్డి మున్సిపాలిటీ పరిధిలోని పోతిరెడ్డిపల్లి ఎంపీపీఎస్ పాఠశాలలో కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన సంగారెడ్డి అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ విద్యార్థుల చేత స్వయంగా అక్షరాభ్యాసం చేయించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు సాధ్యమన్నారు. అనంతరం విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, యూనిఫాం అందజేశారు. కార్యక్రమంలో డీఈవో వెంకటేశ్వర్లు, ఎంఈవో విద్యాసాగర్, సీఎంవో వెంకటేశం, హెచ్‌ఎం సునీత, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. అలాగే మొగుడంపల్లి మండలంలోని రాయిపల్లి తండాలోని ప్రభుత్వ పాఠశాలలో, రామచంద్రాపురం డివిజన్ శ్రీనివాస్‌నగర్ ప్రభుత్వ పాఠశాల, కల్హేర్ ప్రాథమిక పాఠశాల, సిర్గాపూర్ మండల పరిధిలోని సుల్తానాబాద్ ప్రాథమికోన్నత పాఠశాల,వట్‌పల్లి మండలంలోని నాగులపల్లితో పాటు ఆయా గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయులు విద్యార్థులకు అక్షరాభ్యాసం కార్యక్రమం నిర్వహించారు.

మెదక్ జిల్లాలో..

నిజాంపేట/టేక్మాల్/చిలప్‌చెడ్/నర్సాపూర్/చేగుంట/తూప్రాన్, జూన్ 13(ఆంధ్రజ్యోతి): బడిబాట కార్యక్రమంలో భాగంగా మెదక్ జిల్లా నిజాంపేట మండలపరిధిలోని చల్మెడ గ్రామ ప్రాథమిక పాఠశాలలో నిర్వహించిన సామూహిక అక్షరాభ్యాసంలో జిల్లా విద్యాధికారి రాధాకిషన్ పాల్గొన్నారు. బడి ఈడు పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని అందుకోసం ప్రజా ప్రతినిధులు, ఉపాధ్యాయులతో కలిసి సహకరించి ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాప్రమాణాలు పెంచాలని సూచించారు. అదేవిధంగా టేక్మాల్ మండలంలోని బోడ్మాట్‌పల్లి ప్రాథమిక పాఠశాల, చిలప్‌చెడ్ మండలంలోని జగ్గంపేట ప్రాథమిక పాఠశాల, నర్సాపూర్ మండలంలోని అచ్చంపేట ప్రాథమిక పాఠశాల, చేగుంట మండలం వడియారం ప్రాథమిక పాఠశాల, తూప్రాన్ మండలంలోని పలు పాఠశాలల్లో శుక్రవారం సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమాలు చేపట్టారు.

విద్యార్థులు క్రమశిక్షణతో ఉన్నతంగా ఎదగాలి

చిన్నశంకరంపేట, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు క్రమశిక్షణతో చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని వీటీఎస్ ఇండస్ట్రీస్ చీఫ్ హ్యూమన్ ఆఫసర్ అమిత్ అరోరా అన్నారు. మండలంలోని సూరారం గ్రామంలోని హైస్కూల్ గదుల ఏర్పాటు కోసం వీటీఎస్ ఇండస్ట్రీస్, రౌండ్ టేబుల్ ఆఫ్ ఇండియా సహకారంతో రూ. 70 లక్షల వ్యయంతో జడ్పీహెచ్ఎస్ పాఠశాల గదులు, బాలురు, బాలికల టాయిలెట్ రూంలను నిర్మించారు. శుక్రవారం వీటీఎస్ ఇండస్ట్రీస్, రౌండ్ టేబుల్ ఆఫ్ ఇండియా ప్రతినిధులు పాఠశాల గదులను ప్రారంభించారు. వీఎస్‌టీ ఇండస్ట్రీ, రౌండ్ టేబుల్ ఆఫ్ ఇండియా ప్రతినిధులు, ఉపాధ్యాయులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

'మ్యాట్రిక్స్' ఎన్నికల్లో బీఎంఎస్ విజయం

జిన్నారం, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): గడ్డపోతారం పారిశ్రామిక వాడలోని మ్యాట్రిక్స్ పరిశ్రమలో జరిగిన కార్మిక సంఘం గుర్తింపు ఎన్నికల్లో బీఎంఎస్ అభ్యర్థి మల్లేశం విజయం సాధించారు. శుక్రవారం పరిశ్రమలో జరిగిన కార్మిక సంఘం ఎన్నికల్లో మూడు యూనియన్ల ఉమ్మడి అభ్యర్థి నగేష్‌పై బీఎంఎస్ అభ్యర్థి మల్లేశం విజయం సాధించారు. మొత్తం 109 ఓట్లు నమోదు కాగా.. బీఎంఎస్‌కు 60 ఓట్లు పడ్డాయి. జిల్లాలోని కార్మిక సమస్యల పరిష్కారానికి బీఎంఎస్ నిరంతరం కృషి చేస్తుందని విజయోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న అధ్యక్షుడు నర్సింహ్మారెడ్డి, ప్రధాన కార్యదర్శి సాంబశివరావు, జిల్లా కార్యదర్శి మోహన్‌రెడ్డి పేర్కొన్నారు.

వట్‌పల్లిలో సహారా రూరల్ హెల్త్ సెంటర్



వట్‌పల్లిలో హెల్త్ సెంటర్ ప్రారంభోత్సవంలో డైరెక్టర్ మఠం శంకర్ తదితరులు

వట్‌పల్లి/సంగారెడ్డి అర్బన్, జూన్ 13(ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డి జిల్లా వట్‌పల్లి గ్రామంలో సహారా రూరల్ హెల్త్ సెంటర్‌ను స్థానిక ప్రజాప్రతినిధులు, గ్రామస్థులతో కలిసి సహారా సొసైటీ డైరెక్టర్ మఠం శంకర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత ప్రజలకు సమగ్ర ఆరోగ్య సేవలు మరింత చేరువచేయడానికి హెల్త్ సెంటర్ ఏర్పాటు చేశామన్నారు. ఈ సెంటర్‌లో డాక్టర్ కన్సల్టేషన్‌తో పాటు ఎలక్ట్రిక్ ఆటో ద్వారా రవాణా సేవలు ఉచితంగా అందించనున్నామని తెలిపారు. వైద్య సేవలు అవసరమైన వారికి ఆటో సౌకర్యం కల్పిస్తున్నట్టు తెలిపారు. మందులు, ల్యాబ్ పరీక్షలు, ఫిజియోథెరపి సేవలు అతి తక్కువ ధరలకే అందుబాటులో ఉంచామన్నారు. ప్రత్యేక వైద్య నిపుణులు టెలీమెడిసిన్ ద్వారా అందుబాటులో ఉంటారన్నారు. ఈ కార్యక్రమంలో సహారా ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ప్రతిమారెడ్డి, స్థానిక నాయకులు విఠల్, వినయ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఇటు నుంచి అటు.. అటు నుంచి ఇటు!

(3వ పేజీ తరువాయి)

వ్యక్తం చేస్తున్నారు. దీనిపై ప్రశ్నిస్తే విత్తనాల కొరత ఉందని, తమ వద్ద స్టాకు లేదని వ్యాపారులు దబాయిస్తున్నారని వాపోతున్నారు. పైగా మెజార్టీ దుకాణాల్లో రైతులు కొనుగోలు చేస్తున్న ఎరువులు, విత్తనాలకు సంబంధించి ఒరిజినల్ బిల్లులు ఇవ్వడం లేదు. బిల్లులు అడిగే రైతులకు స్టాక్ లేదని అమ్మడం లేదు. దీనిపై కంగ్టి ఏవో హరీశ్‌పవార్ స్పందిస్తూ అధిక ధరలకు ఎరువులు, విత్తనాలు అమ్మేవారి వివరాలు, రసీదులతో ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటామని 'ఆంధ్రజ్యోతి'తో పేర్కొన్నారు.

బిల్లులు లేకుండానే కర్ణాటక సోయా విత్తనాలు

కోహీర్: ఇక్కడ విక్రయిస్తున్న విత్తనాలతో దిగుబడి సరిగా రావడం లేదనే నమ్మకంతో తెలంగాణ రైతులు కర్ణాటక రాష్ట్ర సోయా విత్తనాలపై ఆసక్తి చూపుతున్నారు. బిల్లులు లేకుండానే కొనుగోలుచేసి మోసపోతున్నారు. సంగారెడ్డి జిల్లా కోహీర్ మండలంలోని గురుజువాడ గ్రామానికి చెందిన పలువురు రైతులు కర్ణాటక రాష్ట్రంలోని బసవకళ్యాణ్ నుంచి 150 బస్తాల సోయా విత్తనాలను ఎలాంటి బిల్లులు లేకుండా కొనుగోలు చేశారు. ఈ సమాచారం తెలుసుకున్న వ్యవసాయ అధికారి నవీన్ కుమార్, ఎస్ఐ సతీష్ గ్రామాన్ని సందర్శించి రైతులతో మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రానికి చెందిన సోయా విత్తనాలతో దిగుబడి రావడంలేదని, అందుకే కర్ణాటక నుంచి కొనుగోలు చేసుకున్నట్లు రైతులు తెలిపారు. అయితే, కొనుగోలు చేసిన సోయా విత్తనాలకు సంబంధించి బిల్లులు లేకపోవడంతో, ఏవో నవీన్, ఎస్ఐ సతీష్ సంబంధిత డీలర్‌తో ఫోన్ ద్వారా మాట్లాడి బిల్లులు తెప్పించి పరిశీలించారు. కర్ణాటక నుంచి తీసుకువచ్చి సాగు చేసుకుంటున్న సోయా విత్తనాలు నాటిన తర్వాత ఒకవేళ దిగుబడి రాకపోతే రైతులే నష్టపోతారని, రాష్ట్ర ప్రభుత్వం అందుకు బాధ్యత వహించదని అధికారులు రైతులకు అవగాహన కల్పించారు.

సమస్యల సవాల్

(3వ పేజీ తరువాయి)

చర్యలు కూడా చేపట్టడం లేదనే అభియోగాలు ఉన్నాయి.

మున్సిపాలిటీలు గాడినపడేనా?

వరంగల్ గ్రేటర్ కార్పొరేషన్ కమిషనర్‌గా, హైదరాబాద్ జీహెచ్‌ఎంసీ అదనపు కమిషనర్‌గా పనిచేసిన అనుభవం కొత్త కలెక్టర్ ప్రావీణ్యకు ఉంది. సంగారెడ్డి జిల్లాలో జహీరాబాద్, నారాయణఖేడ్, జోగిపేట, సంగారెడ్డి, సదాశివపేట, అమీన్‌పూర్, తెల్లాపూర్, ఐడీఏ బొల్లారం మున్సిపాలిటీలుగా కొనసాగుతున్నాయి. తాజాగా కోహీర్, గడ్డపోతారం, ఇస్నాపూర్, గుమ్మడిదల మున్సిపాలిటీలను ఏర్పాటు చేశారు. జీహెచ్‌ఎంసీ పరిధిలో పటాన్‌చెరు, రామచంద్రాపురం, భారతినగర్ డివిజన్లు ఉన్నాయి. జిల్లాలో సగం విస్తీర్ణం దాదాపు మున్సిపాలిటీల పరిధిలో ఉన్నట్లుగానే ఉంది. జనాభా సైతం ఇక్కడే ఎక్కువగా నివసిస్తున్నారు. మున్సిపాలిటీల్లోనూ అడ్డగోలుగా అనుమతులిస్తూ అందినకాడికి దోచుకుంటున్నారనే ఫిర్యాదులు ఉన్నాయి. పట్టణాలపై కమిషనర్లు సరైన పర్యవేక్షణ చూపించడం లేదని, ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని తేలడంతో తాజాగా పలువురిపై చర్యలు సైతం తీసుకున్నారు. మున్సిపాలిటీలపై అవగాహన ఉన్న అధికారిణి కావడంతో జిల్లాలోని పట్టణాలను గాడిన పెట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది. పట్టణాలకు ప్రత్యేకంగా అడిషనల్ కలెక్టర్, ప్రత్యేకాధికారులు ఉన్నప్పటికీ తమదైన ముద్ర వేయలేకపోతున్నారనే ప్రచారం జరుగుతోంది.

శాఖలపై పర్యవేక్షణ ఉండాల్సిందే..

పలు శాఖలకు చెందిన జిల్లా స్థాయి అధికారులపై ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి. తమ శాఖలలోని లోటుపాట్లను అడ్డంపెట్టుకొని ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపణలు వస్తున్నాయి. విద్యుత్, జిల్లా పంచాయతీ, నీటిపారుదల శాఖ, డీఆర్‌డీఏ, కాలుష్య నియంత్రణ మండలి, మైనింగ్, పంచాయతీరాజ్, ఆర్అండ్‌బి, సబ్ రిజిస్ట్రార్, పౌర సరఫరాల శాఖల కార్యాలయాలపై ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. సరైన పర్యవేక్షణ లేక కొందరి పరిస్థితి ఎవరికి వారే యమునా తీరే అన్నట్లుగా మారిందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఇబ్బడిముబ్బడిగా శాఖాపరంగా బదిలీలు చేయడం, అనవసరమైన బిల్లులు పెట్టి సర్కారు నిధులు కాజేయడం, ప్రభుత్వ సొమ్ముతో ఇతరులకు మేలు చేయడం తదితర విషయాలలో దిట్టలుగా మారారనే అభియోగాలు ఉన్నాయి.

సర్కారు పాలసీలపై ఫోకస్

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన భూభారతి చట్టంలో భాగంగా జిల్లాలో కొండాపూర్ మండలాన్ని పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేశారు. గత కలెక్టర్ క్రాంతి ఈ విషయంలో ప్రత్యేకంగా దృష్టి పెట్టి అన్ని గ్రామాల నుంచి దరఖాస్తులు స్వీకరించేదాకా శ్రమించారు. అదే విధంగా కొత్త సర్వే మ్యాపులను తయారుచేయడంలో రాష్ట్ర వ్యాప్తంగా ఐదు గ్రామాలను ఎంపిక చేస్తే అందులో వట్‌పల్లి మండలం షాహెద్‌నగర్ సైతం ఉంది. ఇక్కడ పైలెట్ ప్రాజెక్టు పనులను పూర్తి చేయించాలి. మూడునెలలకు ఒక్కసారే సన్నబియ్యంపై సరైన ప్రణాళిక లేక పలుచోట్ల ఇబ్బందులు తలెత్తుతున్నాయి. జహీరాబాద్ ప్రాంతంలోని నిమ్జ్‌లో భూములు కోల్పోయిన 5వేల పైచిలుకు నిర్వాసితులకు ఇళ్ల పట్టాలు ఇస్తామని ఇటీవల సీఎం రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చారు. దీనిని పూర్తి చేయాల్సి ఉంది. ఇక నియోజకవర్గానికి 3,500 ఇందిరమ్మ ఇళ్ల కార్యక్రమంలో బాలారిష్టాలు నెలకొన్నాయి. వీటిని అధిగమించాలి. రాజీవ్ యువ వికాసంపైనా ఫోకస్ చేయాల్సి ఉంది. ప్రతీ సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమంలో స్వయంగా కలెక్టర్ ఉంటేనే జిల్లాలోని సమస్యలపై ఒక అవగాహన వచ్చే అవకాశం ఉంటుంది.